విశాలాంధ్ర ప్రాంతీయం
గుంటూరు, బాపట్ల, పల్నాడు

బీఎంసీయూ కేంద్రాల పరిశీలన

విశాలాంధ్ర-ఫిరంగిపురం: జగనన్న పాల వెల్లువ 3వ ఫేజ్ క్రింద రైతుల నుంచి సేకరించిన పాలు స్టోరేజి కోసం మేరికపూడిలో నిర్మిస్తున్న బీఎంసీయూ(బల్క్ మిల్క్ చీలింగ్ సెంటర్, యూనిట్) భవన నిర్మాణాలను పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్(జెడి) జెపి. వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. గుంటూరు జిల్లావ్యాప్తంగా మొత్తం 61పాల సేకరణ కేంద్రాలు ఉన్నాయని, సేకరించిన పాలను భద్రపరిచేందుకు పాల స్టోరేజీల కోసం మండలంలో మేరికపూడి, గొల్లపాలెం, తక్కెళ్ళపాడు గ్రామాల్లో బీఎంసీయూలు భవన నిర్మాణాల కోసం సిద్ధంగా ఉన్నాయి. ముందుగా ఫిరంగిపురం పశువుల హాస్పిటల్‌ను అకస్మికంగా సందర్శించి హాస్పిటల్లో వైద్యుల పని తీరును అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. ఫిరంగిపురం మండల పశు వైద్యాధికారి కోటి రత్నం, నుదురుపాడు పశు వైద్యాధికారి షేక్ ఫీర్ అహమ్మద్ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలు

విశాలాంధ్ర-ఫిరంగిపురం: మండలంలోని కండ్రికలో నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ ఫరీనాబేగం, 104డాక్టర్ రవికుమార్ గ్రామ ప్రజలకు ఫ్యామిలీ షిజిషియన్ ట్రైయిల్ రన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 53మంది రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. లెప్రసి సర్వేతో పాటు బెడ్ రెస్ట్ రోగికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మండల టీడీపీ అధ్యక్షుడు మండవ చిన నర్సింహారావు, సర్పంచ్ మండవ పెద నర్సింహారావు, ఎంపీటీసీ దేవరపల్లి పరిశుద్ధం, సీహెచ్‌వో వెంకట లక్ష్మీ, ఎంపీహెచ్‌ఈవో తెనాలి లూర్థురాజు, హెచ్‌వీ ఖాజాబి, హెల్త్ సూపర్‌వైజర్ గోవిందయ్య, ఏఎన్‌ఎంలు విజయరాణి, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, ఆషాలు పాల్గొన్నారు.

రేపు మెగా ఎంటర్‌టైన్‌మెంట్ మ్యూజికల్ నైట్

విశాలాంధ్ర-గుంటూరు : హోటల్ గ్రాండ్ నాగార్జున ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ మెగా ఎంటర్‌టైన్‌మెంట్ మ్యూజికల్ నైట్ జరగనుందని హోటల్ గ్రాండ్ నాగార్జున మేనేజింగ్ డైరెక్టర్ అరవింద్ తెలిపారు. గుంటూరులోని హోటల్ గ్రాండ్ నాగార్జునలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నల్క నాగేశ్వరరావు, శివ నారాయణ, శర్మ, కళ్యాణ్, కరీంలతో కలిసి ఆయన మాట్లాడారు. కరోనా విపత్తు కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, ఈ నేపథ్యంలో ప్రజలకు మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఇవ్వాలనే ఉద్దేశంతో 27న సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు మెగా ఎంటర్‌టైన్‌మెంట్ మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బిగ్ బాస్ సెలబ్రిటీస్, జబర్దస్త్ టీం, ఢీ డ్యాన్సర్స్, ఐడియాల్ సింగర్స్, పల్సర్ బైక్ ఝాన్సీ టీం, పలువురు నటీనటులు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలని కోరారు. ఈ వేడుకకు టికెట్, భోజనంతో కలిపి రూ.999 ధర నిర్ణయించినట్లు తెలిపారు.

కామన్వెల్త్ క్రీడలకు కేఎల్‌యూ విద్యార్థిని

విశాలాంధ్ర-తాడేపల్లి: కేఎల్ విశ్వవిద్యా లయంలో బీఏ ఐఏఎస్ మూడవ సంవత్సరం చదువుతున్న అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ సాదియా అల్ మాస్ కామన్వెల్త్ క్రీడలకు ఎంపికైనట్లు విశ్వవిద్యాలయం క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరి కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్‌లో అత్యంత ప్రతిభావంతురాలు అయిన సాదియా కామన్వెల్త్ క్రీడలకు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ నెల 27 నుండి డిశంబరు 1 వరకు న్యూజిలాండులో జరగనున్న కామన్వెల్త్ క్రీడల్లో పవర్ లిఫ్టింగ్ విభాగంలో పోటీ పడనున్న సాదియాకు విశ్వవిద్యాలయ ఉప కులపతి డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వెంకట రామ్‌లు మాట్లాడుతూ సాదియా కామన్వెల్త్ క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచి దేశానికి, రాష్ట్రానికి విశ్వ విద్యాలయానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురా వాలని కోరారు. డీన్, విద్యార్థి సంక్షేమ విభాగ అధిపతి డాక్టర్. హనుమంత రావు వ్యాయామ ఉపాద్యాయురాలు డాక్టర్ కె.సుజాత అధ్యాపకులు సాదియాకు వీడ్కోలు పలికారు.

సీఎం క్యాంపు కార్యాలయం వద్ద భార్యాభర్తల ఆందోళన

విశాలాంధ్ర-తాడేపల్లి: సీఎం క్యాంపు కార్యాలయం గేటు వద్ద శుక్రవారం భార్యా భర్తలు ఆందోళన నిర్వహించారు. కులాంతర వివాహం చేసుకున్నందుకు గత కొంతకాలంగా భర్త బంధువులు వేధింపులకు పాల్పడుతున్నారని, మాపై హత్యా ప్రయత్నం జరిగిందని రాయన జ్ఞానేంద్ర, అనూష దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా కమిషన్‌ను ఆశ్రయించినా మాకు న్యాయం జరగలేదని వాపోయారు. ఆస్తుల కోసం నా భర్త తరపు బంధువులు మమ్మల్ని చంపేందుకు ప్రయత్నిస్తున్నారని మాకు రక్షణ కల్పించాలని సీఎం జగన్మోహన్ రెడ్డిని కలిసేందుకు వచ్చామని తెలిపారు. అయితే తమను పోలీసులు అడ్డుకున్నారని భార్యాభర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్

విశాలాంధ్ర-తాడేపల్లి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తాడేపల్లి నులక పేట వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ వద్ద శుక్రవారం 97వ రోజు మారుతి ఫౌండేషన్ చైర్మన్ జంగాల సాంబశివ రావు సహకారంతో భోజనం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో లోకేష్ అధిక మెజారిటీతో గెలుపొందుతారన్నారు. పట్టణ ఉపాధ్యక్షులు సిహెచ్ శివుడు, గుంటూరు తెలుగు యువత పార్లమెంటు కార్యదర్శి షేక్ బాజీ, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు లీలా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ విద్యా పితామహుడు హర్రీకోబక్ జయంతి

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ వ్యాయామ విద్యా పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి శిఖా బుజ్జిబాబు ఆధ్వర్యంలో భారతీయ వ్యాయామ విద్యా పితామహుడు హర్రీకోబక్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ హెచ్‌సీ బక్ ఒక అమెరికన్ కళాశాల క్రీడాకోచ్, శారీరక విద్యాబోధకుడని, అతను 1920 సంవత్సరంలో మద్రాస్‌లో వైఎంసీఏ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌ను స్థాపించాడని గుర్తుచేశారు. ఇది క్రీడలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, ఉపాధ్యక్షులు ఆనంద్, కార్యదర్శులు గౌరీశంకర్, ప్రవీణ్ నాయక్, మనిరెడ్డి, గోపి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి మహాధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర-మంగళగిరి : రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 26న విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్నాలో రైతాంగం పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి పిలుపునిచ్చారు. మంగళగిరి వేములపల్లి శ్రీకృష్ణ భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. అనంతరం మాట్లాడుతూ 550 రైతు సంఘాలు ఢిల్లీలో నల్లచట్టాలు రద్దు చేయాలని పోరాటం చేస్తుంటే మోదీ క్షమాపణ చెప్పి నల్లచట్టాలను రద్దు చేస్తామని, స్వామినాథన్ కమిషన్ అమలుపరుస్తామని, గిట్టుబాటు ధర ఇస్తామని చెప్పి అమలు పరచకుండా ఎన్నికల్లో గెలిచిన తర్వాత అన్ని హామీలు తుంగలో తొక్కారని అన్నారు. ప్రధాని జాతికిచ్చిన హామీ అమలు చేయాలని, నల్లచట్టాలను ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ శాఖ మంత్రి కుమారుడిపై చర్యలు తీసుకోవాలని, మోటార్లకు మీటర్లు బిగించడం ఆపివేయాలని, విద్యుత్ సవరణ చట్ట బిల్లు నిలిపివేయాలని, రైతులు రుణాలు రద్దు చేయాలని, అన్ని పంటలకు మద్దతు ధరలు, గ్యారెంటీ చట్టం చేయాలని, ఉద్యమ సమయంలో రైతులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా తలపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, ఏరియా కార్యదర్శి సాంబిరెడ్డి, సీపీఐ నియోజకవర్గ రైతు సంఘం సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నియోజకవర్గ నాయకులు జేఎస్ఆర్‌బీ రాంబాబు, జాన్ సైదా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా క్రికెట్ స్టేడియం: కలెక్టర్

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరిలోని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ క్రికెట్ స్టేడియంలో నిర్మించిన క్రీడాకారుల డ్రెస్సింగ్ రూమ్, మ్యాచ్ అఫీషియల్ రూములు సీసీ రోడ్లను జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాల్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అధునాతనంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో ఈ స్టేడియంను నిర్మించారని తెలిపారు. ఇంకా కొన్ని పనులు మిగిలినా కూడా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఈ మధ్య కాలంలో పూర్తి అయ్యేందుకు తన వంతు కృషి చేస్తున్నద న్నారు. క్రికెట్ క్రీడాకారులకు మంచి గ్రౌండ్‌ను, వసతి కల్పించాలనే ఉద్దేశ్యంతో కృషి చేస్తున్నద న్నారు. వారి కృషిని అభినందిస్తున్నాన న్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రపంచ మంతా అభిమానించే ఆట క్రికెట్ అన్నారు. క్రికెట్ స్టేడియం ప్రారంభానికి కొన్ని న్యాయపరమైన చిక్కులు అడ్డంకిగా ఉన్నాయని, అవి తొలగిన వెంటనే ప్రారంభమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శివారెడ్డి మాట్లాడుతూ అన్ని హంగులతో క్రికెట్ స్టేడియంను తీర్చిదిద్దామని చెప్పారు. బీసీసీఐ నిధులతోనే క్రికెట్ స్టేడియం నిర్మాణం జరిగిందని త్వరలో రంజీ ట్రోఫీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి తహశీల్దార్ రామ్ ప్రసాద్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం.వెంకట శివారెడ్డి, మేనేజర్ భాస్కర్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-గుంటూరు : ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో గత రెండేళ్ల నుంచి నమోదు కాకుండా పెండింగ్‌లో ఉన్న వాటిని వెంటనే నమోదు చేయాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ, జిల్లా ముఖ్య కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరెడ్డిని కోరినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సుబ్బారావు తెలిపారు. ఇటీవల బదిలి అయిన ఉపాధ్యాయులకు వారి ఖాతాలకు వెంటనే జమచేయాలని, మార్చి 2022 నుంచి ఉపాధ్యాయుల జీతాల నుంచి మినహాయింపు చేసిన సొమ్ములను వారి ఖాతాలో జమ చేయాలని కోరగా శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులను పిలిపించి, మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. జిల్లాపరిషత్ వెబ్‌సైట్‌ను ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయులు పరిశీలించుకునే విధంగా త్వరలో అప్‌డేట్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టిబోయిన నరసింహారావు, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ విజయానంద్, జిల్లా ఉపాధ్యక్షుడు పి.రమేష్, సీనియర్ నాయకులు ఎం.భాను, దాసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేట టూటౌన్ సీఐగా వీరేంద్రబాబు

విశాలాంధ్ర-నరసరావుపేట: సాధారణ బదిలీల్లో భాగంగా నరసరావుపేట టూ టౌన్ సీఐగా వీరేంద్రబాబు నియమితులయ్యారు. శుక్రవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు సేకరించి, జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో శాంతి భద్రతలు, అసాంఘిక కార్యక్రమాలను అరికట్టేందుకు కృషి చేస్తానన్నారు.

విద్యార్థులతోనే సమాజాభివృద్ధి

విశాలాంధ్ర-గుంటూరు : సమాజాభివృద్ధి నేటి విద్యార్థులపై ఆధారపడి ఉందని డీడీ మధుసూధనరావు వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం వచ్చి 75యేళ్లయినా దేశంలో ఇంకా పేదరికం, నిరక్షరాస్యత కొనసాగుతూనే ఉన్నాయన్నారు. అయితే వీటిని మార్చగలిగే శక్తి ఈనాటి విద్యార్థులకే సాధ్యమన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్, సాంఘిక సంక్షేమ శాఖ గుంటూరు జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరులోని సాంకేతిక పరివర్తన భవనంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మధుసూధనరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రాజ్యాంగం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తొలుత వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించగా గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీబీఆర్‌సీ కార్యదర్శి అల్లాడి దేవకుమార్, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్‌లు అనిల్ కుమార్, డాక్టర్ రమణమూర్తి, ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ ఎం.హేమలత, శోభారాణి, వి.రవితేజ, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు నివారించాలి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: సమాజంలో తరుచు మహిళపై జరుగుతున్న హింసా దాడులు, అరాచకాలను అందరు ఐక్యంగా సమన్వయంతో నివారించుకోవాల్సిన అవసరం ఉందని స్థానిక ఎంపీడీవో దాసరి అనురాధ అన్నారు. మహిళలపై హింస నివారణ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు 16రోజులు క్యాంపెయిన్ నిర్వహణలో భాగంగా ఐసీడీఎస్ కార్యాలయంలో అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ మహిళలపై జరిగే హింస, దాడులు, అరాచకాలు గురించి వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకెపి ఏపీఎం సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హేమలత, నిర్మల, ఆనందమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు ర్యాలీగా పాల్గొని ఎంపీడీఓ కార్యాలయంలో మానవహారం నిర్వహించి మహిళల హక్కులపై నినాదాలు చేశారు.

మహాసభలు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-వినుకొండ: రాజమండ్రిలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో జరగనున్న 7వ జాతీయ భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభలకు రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులు, 26న జరిగే కార్మిక ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తలు పిలుపునిచ్చారు. వినుకొండ శివయ్య భవన్ ఏఐటీయూసీ కార్యాలయం నందు భవన నిర్మాణ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. ఏరియా అధ్యక్షులు కొండ్రముట్ల సుభాని అధ్యక్షత వహించగా రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ మహాసభకు దేశం నలుమూలల నుండి ప్రతినిధులతో పాటు భవన నిర్మాణ కార్మిక సంఘం అనుబంధ కార్మికులు పాల్గొంటారని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పోరాట పటిమను నిర్మించుకొని సంక్షేమ బోర్డును రక్షించుకొనుటకు, క్లైముల పరిష్కారం కొరకు కార్మికులు సన్నద్ధం కావాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మీరావలి, నాగూర్, మస్తాన్వలి, మల్లెల ప్రసాదు, కంద పూజారి, అంజి, ఉగ్గ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పాలన లేదు: మాకినేని

విశాలాంధ్ర-గుంటూరు : మూడున్నరేళ్లుగా రాష్ట్రంలో పాలన లేదని, అభివృద్ధి అసలే లేదని మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య అన్నారు. స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ మాకినేని పెదరత్తయ్య అధ్యక్షతన ప్రత్తిపాడు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ అరాచక విధానాలు, ఆటవిక పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎడా పెడా పన్నులు బాదేస్తూ జనం జేబులు గుల్లచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల జీవనప్రమాణాలు పణంగా పెట్టి రాష్ట్రానికి ఆదాయం సమకూర్చుకోవడమే అజెండాగా వైసీపీ ప్రభుత్వ పనితీరు ఉందని విమర్శించారు. ప్రతిపక్షనేతగా అమరావతిని ఏకైక రాజధానిగా అసెంబ్లీలో ఒప్పుకొని.. అధికారంలోకి వచ్చాక మాట తప్పి మడమ తిప్పి మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేస్తూ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసారని మండిపడ్డారు. అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగించాలని శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న రైతుల పట్ల జగన్ అనుసరిస్తున్న ఆటవిక విధానం సభ్యసమాజం తల దించుకునేలా ఉందని అన్నారు. ఏపీ జీవనాడి పోలవరాన్ని పూర్తి చేయలేదని, జగన్ చెత్త పాలనతో ప్రజలను రోడ్డుకీడుస్తున్నాడన్నారు. మహిళలకు రక్షణ లేదని, మూడున్నరేళ్ల వైసీపీ పాలనలో మహిళలపై 35 వేలకిపైగా నేరాలు జరిగాయంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లా వీరయ్య చౌదరి, భీమినేని వందనాదేవి, గింజుపల్లి వెంకటేశ్వరరావు, నక్కల అగస్టీన్, జెట్టి రేణుక, గింజుపల్లి శివరాం ప్రసాద్, జంపని హనుమంతరావు, కల్లూరి శ్రీనివాసరావు, మన్నవ పూర్ణచంద్రరావు, నువ్వుల సునీల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పాఠకులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు

విశాలాంధ్ర-మంగళగిరి: సంస్కారవంతమైన జీవితానికి పుస్తక పఠనం చాలా ముఖ్యమని, రాష్ట్ర వ్యాప్తంగా పౌర గ్రంథాలయాల్లో పాఠకు లకు మెరుగైన సేవలు అందించేలా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు తెలిపారు. శుక్రవారం మంగళగిరి లోని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వాల కాలంలో గ్రంథాలయ వ్యవస్థ పూర్తిగా నిర్లక్ష్యంకు గురైందని, గ్రంథాలయాల సెస్ నిధులను సైతం వేరే శాఖలకు మళ్లించారన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అట్టడుగు వర్గా లకు ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను అందించటానికి విద్యారంగంలో సమూల మార్పులు చేస్తున్న విధంగా, గ్రామ స్థాయిలో గ్రంథాలయ వ్యవస్థను అందుబాటులోకి తేవటానికి, రాష్ట్రవ్యాప్తంగా 10960 డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటుకు శ్రీకారం చుట్టి సమాజ అభ్యుదయానికి కృషి చేస్తున్నారన్నారు. పోటీపరీక్షలకు సిద్ధం అవుతున్న వారికి అవసరమైన పుస్తకాలను గ్రంథాలయాలలో అందుబాటులో ఉంచటంతో పాటు, లైబ్రరీల డిజిటలైజేషన్, ఇంటర్నెట్ సౌకర్యాలతో తీర్చిదిద్దుతామన్నారు. పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు డా.ఎం.ఆర్. ప్రసన్న కుమార్, ఉప సంచాలకులు పీర్ అహ్మద్, సహాయ సంచాలకులు దీక్షితులు, శర్మ, గ్రేడ్ 1 గ్రంధపాలకులు కె.నాగరాజు పాల్గొన్నారు.

29 నుంచి సివిల్ సప్లయీస్ కార్మికుల పని బంద్

యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు

విశాలాంధ్ర-గుంటూరు : సివిల్ సప్లయీస్ కార్మికులకు పెంచిన కూలీ రేట్లు జీఓను విడుదల చేయని నేపథ్యంలో ఈ నెల 29వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల పాటు పని బంద్ నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా) వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు తెలిపారు. పని బంద్‌కు సంబంధించిన నోటీసును శుక్రవారం గుంటూరు జిల్లా పౌర సరఫరాల మేనేజర్ లక్ష్మీకి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూలి రేట్లు పెంపుదల అగ్రిమెంట్ పూర్తి అయి సంవత్సరం గడుస్తున్నప్పటికి నేటికి అమలు చేయని కార్పొరేషన్ అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు పనిభద్రత, సొంత గొడౌన్ల నిర్మాణం, ప్రావిడెంట్ ఫండ్ సమస్యలను పరిష్కరించాలని తదితర డిమాండ్లతో ఈ నెల 29, 30 తేదీలలో పని బంద్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రావుల అంజిబాబు, కోట్ల మరియదాసు, వినుకొండ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్ పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-వినుకొండ: టీఎన్ఎస్ఎఫ్ సంక్షేమ హాస్టల్ పోరు బాట పోస్టర్‌ను పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు జీవీ ఆంజనేయులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనాలను పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కూరపాటి హనుమంతరావు, నియోజకవర్గ అధ్యక్షుడు నర్రా కిషోర్, అధికార ప్రతినిధి ప్రశాంత్, సెక్రటరీ అబ్దుల్, ఉపాధ్యక్షుడు వెంకట సాయి జనరల్ సెక్రెటరీ అబ్దుల్ భాష, సెక్రటరీ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు: నగరంలో టెండర్ పొందిన అభివృద్ధి పనులు వేగంగా జరగాలని, పనుల పురోగతిపై ప్రతి రోజు ఏ.ఈ.ల వారీగా నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. శుక్రవారం నగరంలో జరుగుతున్న, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, నాడు-నేడు పనులు, తదితర అంశాలపై నగంపాలక సంస్థ ఇంజినీరింగ్, విద్యుత్ శాఖ, హౌసింగ్, ఆర్అండ్‌బి అధికారులతో సమీక్షా నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే టెండర్ పొందిన పనులు మందకొడిగా జరగడానికి వీలు లేదని, పనుల వేగవంతంకు ఏఈల వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. టెండర్ పొందినా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రతిపాదించిన పనులు అధిక ప్రాధాన్యతతో వేగంగా చేపట్టాలన్నారు. సమావేశంలో ఎస్ఈ. భాస్కర్, ఈఈలు సుందర్రామిరెడ్డి, శాంతి రాజు, కోటేశ్వరరావు, ఏడీహెచ్.రామారావు, ఎంఈవో ఖుద్దూస్, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు డీఐ సందర్శన

విశాలాంధ్ర-గుంటూరు : సంగడిగుంటలోని మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎస్‌కే ఎండీ ఖాసిం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పక్కాగా ఉండాలని, ప్రతి విద్యార్థి తల్లి ఆధార్ వివరాలు, బ్యాంక్ ఎకౌంటు వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ఉర్దూ అకాడమీ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన షహనాజ్ బేగంను ఘనంగా సన్మానించారు. డీఐ ఖాసిం మాట్లాడుతూ సెప్టెంబర్ 5న జరిగే ఉపాధ్యాయ దినోత్సవంతో పాటు నవంబర్ 11న ప్రత్యేకంగా ఉర్దూ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ దినోత్సవ సందర్భంగా అవార్డులతో సత్కరించడం అభినందనీయమని, కష్టపడి పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని, ఉపాధ్యాయిని షహనాజ్ బేగం అహర్నిశలు పాఠశాల, విద్యార్థుల అభివృద్ధి కోసం కృషి చేసిన వ్యక్తి అని, అవార్డు పొందడానికి పూర్తిగా అర్హురాలని అన్నారు. మైనార్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఇషాక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇమామ్ జాని, ఉపాధ్యాయులు రిజ్వానా బేగం పాల్గొన్నారు.

కృష్ణ మృతి తెలుగువారికి తీరని లోటు

విశాలాంధ్ర-తెనాలి : కృష్ణ తెలుగువారి సూపర్‌స్టార్ అని, ఆయనే అల్లూరి, ఆయనే మన జేమ్స్‌బాండ్ అని నిజ జీవితంలోనూ, మనస్సున్న మనిషిగా సినీ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకున్న సూపర్‌స్టార్ కృష్ణ మృతి తెలుగు వారికి తీరనిలోటని తెనాలి శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్ నివాళులర్పించారు. రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శుక్రవారం కళలకాణాచి తెనాలి-వేద గంగోత్రి ఫౌండేషన్ విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో పద్మభూషణ్ నటశేఖర కృష్ణ సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులర్పించారు. సభకు సినీ రచయిత, డాక్టర్ సాయిమాధవ్ బుర్రా అధ్యక్షత వహించారు. సినీ రచయిత సాబీర్‌షా సభాపరిచయం చేశారు. శివకుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ సినీ రంగంలో అనేక వినూత్న విప్లవాత్మక సాహసోపేతమైన మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత కృష్ణకే దక్కుతుందన్నారు. బహు ముఖ ప్రజ్ఞాశాలిగా దాదాపు 340 చిత్రాలకు పైగా నటించి తెలుగు ప్రజల మన్ననలు పొందిన విశిష్ట వ్యక్తిగా పేర్కొన్నారు. కృష్ణ జ్ఞాపకార్థం కృష్ణ మెమోరియల్ ఏర్పాటు చేస్తామని, తెనాలి ట్యాంక్ బండ్‌పై కృష్ణ నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కృష్ణ గొప్పతనాన్ని చాటుతామన్న సభలో గోగినేని కేశవరావు, ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, ఎన్టీఆర్ పరిషత్ నిర్వాహకులు జానీబాషా, మాధవి, తదితరులు పాల్గొన్నారు. సభలో కృష్ణ గానామృతం శ్రీ సైదా ఆర్కెస్ట్రా అండ్ ఈవెంట్స్ తెనాలి ఆధ్వర్యంలో నిర్వహించారు.

నేటి యువతకు కొఠారు గోపి స్ఫూర్తి

విశాలాంధ్ర-తెనాలి : అవయవ దానంతో మరో ఐదు కుటుంబాల్లో వెలుగులు నింపిన కొఠారు గోపి నేటి యువతకు స్ఫూర్తి అని తెనాలి పట్టణ టింబర్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోటకూర వెంకట రమణ రావు అన్నారు. శుక్రవారం సత్యం, శివం, సుందరం సామాజిక సేవా కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక నాజరుపేట టంకశాల వారివీధిలో అవయవదాత కొఠారు గోపి నాల్గొవ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా గోపి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన కో ఆపరేటివ్ బ్యాంక్ మాజీ సిఇఓ దైవాల సుబ్రహ్మణేశ్వరరావు మాట్లాడుతూ బిడ్డ దక్కడని తెలిసి తమ బిడ్డ అవయవాలను దానం చేసి మరో 5 కుటుంబాల్లో వెలుగులు నింపిన కొఠారు గోపి తల్లిదండ్రులు ఆదర్శనీయులని అన్నారు. మరో అతిథి పట్టణ ప్రముఖ న్యాయవాది పొన్నం విజయ్‌కుమార్ మాట్లాడుతూ చావు పుట్టుకలు సహజమైనా తన మరణానంతరం కూడా మరో అయిదుగురిలో సజీవంగా ఉన్న అమరజీవి కొఠారు గోపి అన్నారు. అనంతరం నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సేవా కేంద్రం వ్యవస్థాపకులు తస్నీరు శివ శంకర్, కొఠారు శ్రీను, మైలా నాగరాజు, అన్నం రవి, కేశంశెట్టి శివ, విష్ణుమొలకల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

Canara Bank — A Government of India Undertaking — Syndicate

కెనరా బ్యాంక్, ఏఆర్ఎం బ్రాంచ్, గ్రౌండ్ ఫ్లోర్, సర్కిల్ ఆఫీస్ బిల్డింగ్, రైల్ నిలయం పక్కన, సికింద్రాబాద్-500026, ఫోన్: 040- 27725259, 27725260 / 83/ 85, ఇ-మెయిల్: cb2752@canarabank.com

విక్రయ ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క నిబంధన 8 (6)తో చదివే సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం కింద స్థిర ఆస్తుల విక్రయం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు

ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా.. ఎం/ఎస్ చైతన్య వరుణ్ జిన్నింగ్ చునసత ప్రైవేట్ లిమిటెడ్ (పూర్వం చైతన్య ఎంటర్‌ప్రైజెస్‌గా తెలిసినది) డి.నం.7-303, సర్వే నం.354, పొలిమేర డొంక, గణపవరం, నాదెళ్ల (ఎం), చిలకలూరిపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522619. దానికి డైరెక్టర్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ అన్నం శ్రీనివాసరావు తండ్రి శ్రీ వెంకట్ రావు, హెచ్.నం. 6-377, చెరుకుతోట కాలనీ, సరూర్‌నగర్, హైదరాబాద్, తెలంగాణ-500035 మరియు శ్రీ అన్నం శ్రీనివాసరావు తండ్రి శ్రీ వెంకట్ రావు, డి.నం.7-303, సర్వే నం.354, పొలిమేర డొంక, గణపవరం, నాదెళ్ల (ఎం), చిలకలూరిపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522619 మరియు శ్రీ అన్నం శ్రీనివాసరావు తండ్రి శ్రీ వెంకట్ రావు, డి.నం.354, గణపవరం, నాదెళ్ల (ఎం), చిలకలూరిపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522619 మరియు శ్రీమతి అన్నం మణిమాల భర్త శ్రీ అన్నం శ్రీనివాసరావు డి.నం.7-303, సర్వే నం.354, పొలిమేర డొంక, గణపవరం, నాదెళ్ల (ఎం), చిలకలూరిపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522619. మరియు శ్రీమతి అన్నం మణిమాల భర్త శ్రీ అన్నం శ్రీనివాసరావు డి.నం.354, గణపవరం, నాదెళ్ల (ఎం), చిలకలూరిపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522619. శ్రీ బిల్లా శివయ్య తండ్రి బి. నారాయణ, హెచ్.నం. 6-377, చెరుకుతోట కాలనీ, సరూర్‌నగర్, హైదరాబాద్, తెలంగాణ-500035 ల నుంచి కెనరాబ్యాంక్ ఎంసీబీ సోమాజీగూడ బ్రాంచికి బకాయి పడ్డ మొత్తం (31/10/2022 నాటికి ఒప్పంద బకాయిలు) రూ.37,59,69,976/- లను రాబట్టుకునేందుకు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జీ చేయబడిన ఎంసీబీ సోమాజీగూడ బ్రాంచ్ అధీకృత అధికారి ద్వారా భౌతిక స్వాధీనంలోకి తీసుకోబడి తదుపరి చర్య కోసం కెనరా బ్యాంక్ ఏఆర్ఎం బ్యాంక్‌నకు బదలాయించిన ఈ కింద ప్రస్తావించిన స్థిర ఆస్తి "ఎక్కడ ఉన్నది ఉన్నట్లు", "ఉన్నది ఉన్నట్లుగా" మరియు "అక్కడ ఏమున్నది అది" ప్రాతిపదికపై తేదీ: 14.12.2022 న విక్రయించబడుతున్నది.

వేలం తేదీ మరియు సమయం:14/12/2022, ఉ.11.30 గం. నుంచి 12.30 గం.
(అమ్మకం ముగిసే వరకు ప్రతి సారీ 10 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)
ధరావత్తు సొమ్ము డిపాజిట్ 12/12/2022 .5:00 గం. వరకు లేదా అంతకు ముందుగా చెల్లించవలెను.

స్థిర ఆస్తుల యొక్క వివరాలు మరియు పూర్తి వివరణ

భాగం నం 1: నరసరావుపేట రెవిన్యూ డివిజన్, చిలకలూరిపేట సబ్-రిజిస్ట్రార్ పరిధిలో విక్రయ ఒప్పందం నం.4225/2009 ద్వారా శ్రీమతి అన్నం మణిమాల పేరుతో ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, పిన్-522619, చిలకలూరిపేట, నాదెండ్ల మండలం, గణపవరం గ్రామం మరియు గ్రామ పంచాయతీ, ఎన్‌హెచ్ రోడ్డు, సర్వేనం.354లో ఉన్న ప్లాట్ & మెషినరీ సహా కపాస్& సీడ్ హోల్ పాయింట్ షెడ్, ప్రెస్‌హోల్, 2 జిన్నింగ్ మిల్స్ యూనిట్లు, డస్ట్&స్టోర్ రూమ్స్, ప్రెస్ స్టోర్ రూమ్స్, ప్రెస్ స్టోర్ రూమ్స్&ఆఫీస్ భవనం (జి+1 ఫ్లోర్స్)తో 2 ఎకరాల 20 సెంట్లు కొలత గల ఇండస్ట్రియల్/ఫ్యాక్టరీ భూమి మొత్తంగా . హద్దులు: ఉత్తరం: వాగు 210 లింకులు, దక్షిణ: సర్కిల్ డొంక 215 లింకులు, తూర్పు: జాడ కోటేశ్వరరావు భూమి 1180 లింకులు, పడమర: కోట శ్రీరామ మూర్తి భూమి 1314 లింకులు.

రిజర్వు ధర: రూ.2,40,00,000/- మరియు డిపాజిట్ చేసే ధరావత్తు సొమ్ము (ఇఎండీ) రూ.24,00,000/-

భాగం నం 2 : నరసరావుపేట రెవిన్యూ డివిజన్, చిలకలూరిపేట సబ్-రిజిస్ట్రార్ పరిధిలో విక్రయ ఒప్పందం నం.6306/2007 ద్వారా శ్రీమతి అన్నం మణిమాల పేరుతో ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, పిన్-522616, చిలకలూరిపేట మునిసిపాలిటీ కింద పురుషోత్తమపట్నం, చిలకలూరిపేట టౌన్, ఎన్‌ఆర్‌టి సెంటర్, ఎన్.హెచ్.నం.5, ఎల్ఐసి & ఎస్‌బిఐ పక్కన ఉన్న బ్లాక్ నం.7, సర్వే నం.142/సిలో హెచ్.నం.7-305లో 1988 చదరపు అడుగుల కొలత మ. షెడ్ కలిగియున్న 429.21 చదరపు గజాల కొలత కమర్షియల్ ఆస్తి మొత్తంగా. హద్దులు: ఉత్తరం: 33అడుగుల వెడల్పు బజార్-62 అడుగులు, దక్షిణం: తోట రామకృష్ణ స్థలం-65.28 అడుగులు, తూర్పు: కొల్లా ఫణ్నారావు స్థలం-60.68 అడుగులు, పడమర: శ్రీరంగపట్నం రాజారెడ్డి స్థలం-60.68 అడుగులు.

రిజర్వు ధర: రూ.1,85,00,000/- మరియు డిపాజిట్ చేసే ధరావత్తు సొమ్ము (ఇఎండీ) రూ.18,50,000/-

*బ్యాంకు తెలిసినంతవరకు ఎటువంటి రుణభారాలు లేవు. విక్రయానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ (www.canarabank.com)లో అందించిన "ఇ- వేలం" లింక్‌ను చూడండి లేదా ఏదైనా పని రోజున ఆఫీసు వేళల్లో అధీకృత అధికారి, ఏఆర్ఎం బ్రాంచ్, కెనరా బ్యాంక్, ఫోన్‌నం. 040-27725259/27725260ని సంప్రదించవచ్చు.

గమనిక: ఎ) అధీకృత అధికారి, కెనరా బ్యాంక్, ఏఆర్ఎం బ్రాంచ్‌కు పేరిట డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా రిజర్వ్ ధరలో 10% ఇఎండీ మొత్తాన్ని డిపాజిట్ చేయాలి లేదా కెనరా బ్యాంక్ ఏఆర్ఎం బ్రాంచ్, హైదరాబాద్ ఎ/సి నం.209272434 (ఇంటర్‌బ్యాంక్ బదిలీగా చెల్లింపు మోడ్‌ను ఎంచుకోండి) ఐఎఫ్ఎస్‌సి కోడ్: సిఎన్ఆర్‌బి0002752 కు ఆర్‌టిజిఎస్/ఎన్ఇఎఫ్‌టి/ఫండ్ బదిలీ ద్వారా జమ చేయాలి. బి) అధీకృత అధికారితో ముందస్తు అపాయింట్‌మెంట్‌తో తేదీ: 02/12/2022న ఉ.11:00 గం. నుంచి సా.4:00 గం. మధ్య ఆస్తిని తనిఖీ చేయవచ్చు. సి) పైన పేర్కొన్న విధంగా రిజర్వ్ ధర పట్ల వేలం ప్రారంభమవుతుంది. బిడ్డర్లు భాగం నం.1 మరియు భాగం నం.2 రెండింటి కొరకు తమ ఆఫర్‌లను రూ.1,00,000/- గుణకాల్లో మెరుగుపరుస్తారు. "ఆన్‌లైన్" వేలం ముగిసిన తర్వాత అత్యధిక బిడ్ (రిజర్వ్ ధర కంటే ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు. సెక్యూర్డ్ క్రెడిటార్ ధృవీకరణకు లోబడి విజయవంతమైన బిడ్డర్‌కు అనుకూలంగా అమ్మకం నిర్ధారించబడుతుంది. డి) వేలం విధానం: ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ బిడ్డింగ్ ఇ) వేలం జరిగే స్థలం: కెనరా బ్యాంక్, ఏఆర్ఎం బ్రాంచ్, గ్రౌండ్ ఫ్లోర్, సర్కిల్ ఆఫీస్ బిల్డింగ్, ఎంసిహెచ్ నం: 10-3-163 & 10-3-163/ఏ, రైలు నిలయం పక్కన, సికింద్రాబాద్-500 026.

తేదీ: 23/11/2022, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, కెనరాబ్యాంక్

సమసమాజ స్థాపనకే చాపకూడు సిద్ధాంతం

విశాలాంధ్ర-కారంపూడి: కుల,మత, పేద, ధనిక బేధాభిప్రాయాలు లేకుండా ప్రజలందరూ ఒక్కటే అని చాటి చెప్పేందుకు కొన్ని శతాబ్దాల క్రితమే చాపకూడు సిద్ధాంతాన్ని బ్రహ్మనాయుడు ప్రవేశపెట్టారని మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వీర్ల దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చాపకూడు కార్యక్రమానికి నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరిజనులు, గిరిజనులకు ఆలయ ప్రవేశం బ్రహ్మనాయుడు కల్పించారన్నారు. 11వ శతాబ్దంలో ప్రవేశపెట్టిన చాపకూడు సిద్ధాంతాన్ని నేటికి ఒక్క ఆచారంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. తొలుత దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. ముఖ్య అతిథులు సహపంక్తి భోజనాలు చేశారు. పలనాటి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు మందపోరు ఘట్టాన్ని వీర్ల పీఠాధిపతి తరుణ్‌చెన్నకేశవ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జయరాంప్రసాద్, తహశీల్దార్ జి.శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మండుటెండలోనే పల్నాటి వీరాచారవంతులు

విశాలాంధ్ర-కారంపూడి: సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వీరాచారవంతులు, భక్తులు, మహిళలు, చిన్నారులు వీర్ల దేవాలయ ప్రాంగణంలో మండు టెండలోనే పొంగళ్లు వండుకొని, ఎండలోనే సేద తీరుతూ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. పల్నాటి వీరారాధన ఉత్సవాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రభుత్వం, ఉత్సవ కమిటీ కనీసం భక్తులకు నీడను ఏర్పాటు చేయలేకపోవడం దారుణమని స్థానికులు విమర్శిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా వీరాచారవంతులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నా పట్టించుకోకపోగా, కనీసం గుడి ప్రాంగణంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో నీడ ఉండే విధంగా టెంట్లను ఏర్పాటు చేస్తే బాగుండేదని భక్తులు విమర్శిస్తున్నారు. ఉత్సవాలు జరిపేందుకు జిల్లా పరిషత్ నుంచి రూ.4 లక్షలు, గ్రామంలో ప్రజల ఆర్థిక సహకారాలు అందిస్తున్నారు. మండల పరిషత్, పంచాయతీ శాఖల నుంచి నిధులను ఖర్చు చేస్తున్నారు. అయినా అధికారులకు, ఉత్సవ కమిటి భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

స్ఫూర్తి యాత్ర జయప్రదం చేయండి

విశాలాంధ్ర-రొంపిచర్ల : ఈ నెల 26వ తేదీన దేశవ్యాప్తంగా జరుపుతున్న 'భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవము'ను పల్నాడు జిల్లాలోని మండల కేంద్రమైన రొంపిచర్లలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ తెలిపారు. భారత ప్రభుత్వం 2015వ సంవత్సరంలో అంబేద్కర్ 125వ జయంతి సంధర్భంగా అప్పటి నుంచి ప్రతి సంవత్సరం నవంబర్ 26వ తేదీన భారత రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించి ఆ సంవత్సరం నవంబర్ 19న అధికారిక ప్రకటన చేసిందని తెలిపారు. ఇంతటి గొప్ప పండుగను వాడవాడలా ఘనంగా జరుపుకోవాలని రమేష్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు రొంపిచర్లలోని చెరువుకట్ట సెంటర్ వద్ద నుంచి భారత రాజ్యాంగ స్ఫూర్తి యాత్రను ప్రారంభించి రొంపిచర్ల గ్రామ శివారు వరకు ర్యాలీ కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-దుర్గి: మండలపరిషత్ అధ్యక్షులు యేచూరి సునీతశంకర్, జడ్పీటీసీ సభ్యులు శెట్టిపల్లి యల్లమందలు శుక్రవారం స్థానిక బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ బెనహర్ బాబు ఉన్నారు.

రేపు సీహెచ్‌ఎల్ కాంతారావు సంస్మరణ సభ

జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-నరసరావుపేట : భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాది కామ్రేడ్ సీహెచ్‌ఎల్ కాంతారావు సంస్మరణ సభ ఈ నెల 27న ఉదయం 11 గంటలకు నరసరావుపేట పట్టణం ప్రకాష్ నగర్‌లోని భువనచంద్ర టౌన్ హాలులో జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ అన్నారు. పట్టణంలోని పల్నాడు జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ కామ్రేడ్ కాంతారావు నరసరావుపేట పట్టణంలో యుక్త వయస్సు నుంచి కమ్యూనిస్టు ఉద్యమంలో పని చేస్తూ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ప్రాణాలకు సైతం తెగించి ఉద్యమంలో పనిచేశారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా పార్టీని విస్తరించే కార్యక్రమంలో ప్రధాన పాత్ర వహించారని ఒకవైపు లాయర్ వృత్తిని చేస్తూ కార్మికులు, కర్షకుల సంఘాలలో ప్రధాన పాత్రను నిర్వహిస్తూ ప్రత్యక్షంగా పోరాడుతూ ప్రజల సమస్యలపై కోర్టులలో వాదించి వారికి న్యాయం జరిగేలా పోరాటం చేశారన్నారు. పట్టణంలో, నియోజకవర్గంలో అనేకమంది పేద ప్రజల సమస్యలపై పనిచేస్తూ ఇళ్ల స్థలాలు లేని, ఇళ్లు లేని ప్రజలను సమీకరించి పోరాడి ప్రభుత్వ స్థలాలను పేదలతో ఆక్రమింపజేసి కాలనీలను, నివాస గృహాలు ఏర్పాటులో ప్రధాన పాత్ర నిర్వహించారని అన్నారు. ఈ సందర్భంగా జరిగే సంస్మరణ సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ డాక్టర్ కె.నారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. సమావేశంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, నరసరావుపేట సీపీఐ నాయకులు, ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'నట బ్రహ్మ'కు ప్రజలు బుద్ధి చెప్పటం ఖాయం: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ రూరల్ : జగన్ రెడ్డి ప్రభుత్వంలో కరెంటు, ఆర్టీసీ చార్జీలు, నిత్యవసర వస్తువుల ధరలు, వంటగ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ వినుకొండ మండలంలోని భారతపురం గ్రామంలో మండల టీడీపీ అధ్యర్యంలో నిర్వహించిన బాదుడే-బాదుడు కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హాజరై ప్రభుత్వ అసమర్థ విధానాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడున్నర ఏళ్ల పాలనలో ఒక్క ఇల్లు కూడా కట్టలేని వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో భూ మాఫియా చేసి వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. రూపాయలు విలువ చేయని స్థలానికి రూ.6 లక్షలు విలువ కట్టి లబ్ధిదారుని జాబితాలో వేయటం దుర్మార్గమైన చర్య అన్నారు. టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధి తప్ప గ్రామాల్లో ఇప్పటికి ఒక్క అభివృద్ధి కార్యక్రమం జరగలేదని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు ఏటా విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధులు మళ్లించి గ్రామాల్లో అభివృద్ధి లేకుండా చేసిన దౌర్భాగ్య ప్రభుత్వం అని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో జగన్ రెడ్డి దోచుకున్న విధంగానే వినుకొండలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అధికారం అడ్డుపెట్టుకొని పొలిటికల్ రియల్ ఎస్టేట్ చేస్తూ భూ దందాతో వందల కోట్లు దోచుకున్నాడని విమర్శించారు. తన అవినీతి అక్రమాలు ఎక్కడ బయట పడతాయోనని నిత్యం అబద్ధాలాడుతూ ప్రజలను నమ్మించేందుకు ప్రచారం చేయడం సిగ్గుచేటని అన్నారు. పేద ప్రజల భూములను లాగేసుకొని ఒకవైపు పొట్టకొడుతూ మరోవైపు ప్రజల ముందు నట బ్రహ్మగా నటిస్తూ నిరాధారమైన ఆరోపణలు విమర్శలతో ఎమ్మెల్యే చేస్తున్న విష ప్రచారానికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

29నుంచి పని బంద్‌కు పిలుపు

విశాలాంధ్ర-నరసరావుపేట : సివిల్ సప్లయీస్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 29వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా పని బంద్ చేస్తున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన్న ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నరసరావుపేటలోని పౌరసరఫరాల మేనేజర్ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రావుల అంజిబాబు, కోట్ల మరియదాసు, ఎస్‌కే సైదులు, సంపతి వెంకటకృష్ణ, కె.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం పెంపునకు సైన్స్ ప్రదర్శనలు దోహదం

విశాలాంధ్ర-శావల్యాపురం: విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందింపజేసేందుకు సైన్స్ ప్రదర్శనలు దోహదపడతా యని వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం అన్నారు. స్థానిక జడ్పీ పాఠశాలలో జరుగుతున్న సైన్స్ ప్రదర్శనను ఆయన శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన పార్లమెంట్ భవనం, గడియారాలు లేని సమయంలో ఇసుక ద్వారా సమయాన్ని కనుగొనే విధానం, కప్ప గ్రుడ్లు ద్వారా పిల్లల తయారీ తదితర నమూనాలను పరిశీలించి తగిన సూచనలు అందజేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై కూడా ప్రత్యేక దృష్టి సారించి భవిష్యత్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, విజ్ఞాన, సాంకేతిక రంగాలలో విద్యార్థులు బాగా రాణించినపుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం పులిపాటి శ్రీనివాసరావు, పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న స్వచ్ఛ సంకల్పం ప్రారంభం

విశాలాంధ్ర - నకరికల్లు : జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ క్లాప్ మిత్రలతో తొలిసారిగా కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మండలంలోని నరసింగపాడు నుండి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నరసింగపాడు క్లాప్ మిత్ర చిలక మరియమ్మ, షెడ్ మిత్రలు రాజు, వెంకటరమణ, హనుమయ్య, కోటేశ్వరమ్మ, దానయ్య, వెంకట్రావు తదితరులతో పలు అంశాలపై వారి నుంచి సమాధానాలు రాబట్టారు. అనంతరం 64 మంది క్లాపు మిత్ర, షడ్ మిత్రులతో ముఖాముఖి నిర్వహించారు. క్లాప్ మిత్రలలో ఆత్మస్థైర్యం, వ్యక్తిత్వం పెంపొందిం చేలా కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. క్లాత్ మిత్రలకు సంబంధించి వ్యక్తిగత సమస్యలను ఒకటి రెండు నెలలలో పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టమన్నారు. ఇళ్ల పట్టాలు, ఒంటరి మహిళ పింఛన్లు చెల్లించే విధంగా చర్యలు తీసుకుటామన్నారు. జిల్లాలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు 579 ఉన్నాయని అందులో 3000 మంది పైచిలుకు క్లాప్ మిత్రులు పనిచేస్తున్నారని. గ్రామాలు, పట్టణాల పరిశుభ్రతలో క్లాప్ మిత్రల పనితనం చాలా గొప్పదని వారిని సముచిత రీతిలో గౌరవించుకోవడం అవసరమన్నారు. ఎప్పుడూ చెత్తతో పనిచేస్తూ ఉండడం వల్ల ఉత్పన్నమయ్యే ఆరోగ్య సమస్యలను పరిష్కరించే విధంగా ప్రత్యేక కార్యక్రమాన్ని స్పెషలిస్టు డాక్టర్లు చేత నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వరలక్ష్మి, మండల రెవెన్యూ అధికారి సురేష్, మండల పరిషత్ అధికారి బి.శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ ప్రవీణ్ కుమార్ రెడ్డి, సర్పంచ్ సంగు రామకోటమ్మ, వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాఫీ విత్ హరిత రాయబారులు

విశాలాంధ్ర-శావల్యాపురం: ఆరోగ్యవంతమైన గ్రామాలే లక్ష్యంగా జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని మండల ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి అన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ క్లాప్ మిత్రలతో తొలిసారిగా కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమాన్ని మండలంలోని వేల్పూరులో శుక్రవారం ప్రారంభించారు. అనంతరం హరిత రాయబారులతో కాఫీ తాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రతలో హరితరాయలు పనితనం చాలా గొప్పదని వారిని సముచిత రీతిలో గౌరవించుకోవడం అవసరమన్నారు. రెండు వారాలకు ఒకసారి శుక్రవారం పూట క్లాత్ మిత్రులతో కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమాన్ని నిర్వహించి వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించేలా చర్యలు తీసుకుంటామ న్నారు. రానున్న పండుగకి 2జతల సివిల్ బట్టలు 2 జతల క్లాత్ మిత్ర డ్రెస్‌లను అందజేయుటకు చర్యలు తీసుకుంటామన్నారు. వారికి ఇళ్ల పట్టాలు, విద్య, పింఛన్లు మంజూరు వైద్యం తదితర అంశాలలో అన్ని విధాలుగా సహాయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద పచ్చదనం ప్రతిబింబించేలా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, ఎంపీడీవో పేరుమీన శీతారామయ్య, తహశీల్దార్ షేక్ జాన్ సైదులు, ఈఓపీఆర్డీ పొట్టేపాలెం సుగుణ, పంచాయతీ కార్యదర్శి ముండ్రు మనోహర్, డీఏ చంద్రశేఖర్, వీఆర్వో సంతోష లక్ష్మీ, ఏఎన్‌ఎం అమరలింగేశ్వరి, ఇంజనీర్ అసిస్టెంట్లు పుష్పలత, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షతకు ముగింపు పలకాలి

విశాలాంధ్ర-శావల్యాపురం : ఆడ శిశువు పట్ల వివక్షతతో జరిగే భ్రూణ హత్యలను నివారించడంతో పాటు, గర్భస్థ పిండ లింగ నిర్ధారణపై ప్రజలలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీసీలు, వీవోఏలు, అంగన్వాడీ టీచర్లకు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సమాజంలోని సాంఘిక దురాచారాలతో ఆడపిల్లలకు పెద్ద చదువులకు పంపకుండా తక్కువ వయసులో పెళ్లి చేయడం, పుట్టబోయేది ఆడపిల్ల అని తెలుసుకొని ముందే అబార్షన్ చేయించడం ఇంకా సమాజంలో జరుగుతూనే ఉన్నాయని, ఇటువంటి దురాచారాలను రూపుమాపాలని అన్నారు. రాజ్యాంగంలో స్త్రీలకు పురుషులకు సమాన హక్కులు కల్పించిందని, ఉద్యోగాల ఎన్నికలలో సమాన రిజర్వేషన్లను కల్పిస్తుందని అన్నారు. కేరళ రాష్ట్రంలో అక్షరాస్యత ఎక్కువగా ఉన్నందువలన ప్రతి 1000 మంది పురుషులకు 1125 మంది మహిళలు ఉన్నారన్నారు. మండల ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి మాట్లాడుతూ బాల బాలికలు అందరికీ అక్షరాస్యులను చేసినప్పుడే లింగ వివక్షతకు ముగింపు సాధ్యమవుతుందని అన్నారు. పుట్టబోయే బిడ్డను ముందే తెలుసుకోవడం చట్ట రీత్యా నేరమని, అటువంటి వారికి పీసీపీఎన్‌ఆర్డీ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు విధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ జాన్‌సైదులు, ఎంపీడీవో సీతారామయ్య, ఎంఈవో సాంబశివరావు, వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం, ఈఓపీఆర్‌డీ సుగుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

విశాలాంధ్ర-అమరావతి : విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో భాగంగా మండల కేంద్రమైన అమరావతి శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్లో శుక్రవారం మండల విద్యాశాఖాధికారి మేడా శ్రీనివాసరావు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శన నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి పి.మాధురి, తహశీల్దార్ ఎం.విజశ్రీలు ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన విజ్ఞాన శాస్త్రానికి సంబంధించి వివిధ రకాల ప్రాజెక్టులు, బోర్డులు, చార్టులు ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన నమూనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సంవత్సర సమయంలో వారు తయారు చేసిన వివిధ రకాల నమూనాలు ప్రదర్శించడానికి అవకాశం లభించడం పట్ల విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించడం వల్ల విద్యార్థులలో ప్రేరణ కల్పిస్తుందన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల ప్రగతిని తెలుసుకునే సదవకాశం ప్రత్యక్షంగా కలుగుతుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. విద్యార్థులు చేసిన ప్రాజెక్టులు వలన సహచర విద్యార్థులతో పాలుపంచుకోవడం వల్ల ఆ భావనలపై మరింత అనుభవం, అవగాహన పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వజినేపల్లి శేఖర్ బాబు, కార్యదర్శి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు ఎం.విజయ తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షతపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని, లింగ వివక్షత చూపరాదని పెదకూరపాడు మండల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కచేరి సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు యానిమేటర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మహిళలపై జరుగుతున్న అరాచకాలు, అత్యాచారాలు, లింగ వివక్షలను అరికట్టాలంటూ నినాదాలు చేస్తూ పురవీధుల్లో తిరిగారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం, సీసీలు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళా సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-శావల్యాపురం : జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన, సిడాఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహ కారంతో ఈ నెల 26న వినుకొండలోని జూనియర్ కళాశాలలో నిర్వ హిస్తున్న జాబ్‌మేళాకు యువకులంతా పాల్గొని సద్వినియోగం చేసుకో వాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాలో వివిధ ప్రైవేటు రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న సుమారు రెండు వేల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, పది, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, పీజీ విద్యార్హత కలిగి, 18-35 ఏళ్లలోపు యువతీ, యువకులు పాల్గొనవచ్చని తెలిపారు. వేతనం రూ.10-25 వేల వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఆర్పీ శ్రీలక్ష్మి ఉన్నారు.

డ్వాక్రా మహిళల ర్యాలీ

విశాలాంధ్ర-వేమూరు : డ్వాక్రా గ్రూపు మహిళల కుటుంబపరమైన సమస్యల పరిష్కారం కోసం జెండర్ కమిటీలు కృషి చేస్తున్నాయని ఏపీఎం రాము తెలియజేశారు. శుక్రవారం వేమూరులో డ్వాక్రా గ్రూపు మహిళల జెండర్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సమస్యల పరిష్కారం కోసం జెండర్ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. అందుకు అనుగు ణంగా కమిటీలు సేవలందిస్తున్నాయని ఆయన వివరించారు. లింగ వివక్షతపై మహిళలు నడుం బిగించి పోరాడుతున్నాయని, మహిళలను గౌరవ ప్రధంగా చూసే విధంగా ప్రతి ఒక్కరూ ఉండాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో చైతన్య వంతులు అవుతున్నారని ప్రభుత్వం కూడా మహిళలకు సముచిత ప్రాధాన్యమిస్తూ తోడ్పడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ అనురాధ, సీసీలు జెండర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గరికపాటి దైవ కృపారావు మృతి



విశాలాంధ్ర-వేమూరు : సమాజసేవకులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, రైతు నాయకులు, నటుడు, చదలవాడ గ్రామనివాసి గరికపాటి దైవ కృపాకరరావు (68)శుక్రవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. చదలవాడ, పరిసర గ్రామాల్లో ప్రజలకు నిరంతరం సేవా కార్యక్రమాలు, సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. సాంస్కృతికంగా నాటక రంగంలో నటునిగా నాటిక, నాటక ప్రదర్శనలిచ్చారు. ఆధ్యాత్మికంగా దేవాలయాల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తునేవున్నారు. ఆయన మరణవార్త తెలియగానే ప్రజలు ఆయన భౌతికాయానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రజలు దుఃఖసాగరంలో మునిగిపోయారు. కాంగ్రెస్, వైసీపీ, తెలుగుదేశం, కమ్యూనిస్టు పార్టీ, జనసేన, నాయకులు, కార్యకర్తలు భౌతిక కాయంపై పూలమాలలు వేసి జోహార్లు పలికారు. సర్పంచ్ దాసరి రమేష్, వార్డు సభ్యులు ప్రత్యేకంగా శ్రద్ధాంజలి ఘటించారు.

మద్దతు ధరకే ధాన్యం విక్రయించాలి

విశాలాంధ్ర - కర్లపాలెం : రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించాలని సివిల్ సప్లైస్ టెక్నికల్ అసిస్టెంట్ చేబ్రోలు లక్ష్మి తెలిపారు. కర్లపాలెం మండలంలోని వివిధ సచివాలయాల్లో రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం విక్రయాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా సివిల్ సప్లై మేనేజర్ శ్రీలక్ష్మి సూచనలతో ప్రభుత్వ ఆదేశాలతో కర్లపాలెం ఏ.ఓ. అధ్వర్యంలో రైతులకు మద్దతు ధరకు ధాన్యం విక్రయించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకుల ద్వారా ధాన్యాన్ని విక్రయించాలన్నారు. సచివాలయ వ్యవసాయ సహాయకులు, ఏవో పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇస్తే చర్యలు: కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లకు అనుమతులు మంజూరు చేస్తే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 241 అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అక్రమ లేఅవుట్ల ఏర్పాటుపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఎన్.ఓ.సి.లపై విచారణ చేయాలని తెలిపారు. అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం జరిమాన చెల్లింపులపై యంత్రాంగం దృష్టి పెట్టేలా చూడాలన్నారు. ఎన్.ఓ.సి.ల జారీపై సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రతివారం సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. వివిధ పన్నుల రూపంలో, సేవల వినియోగంలో ఆదాయం వివరాలు ఇవ్వాలన్నారు. వాలంటీర్ల ఖాళీల భర్తీ కోసం చర్యలు తీసుకోవాలన్నారు. 459 గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలు, వాటి నిర్వహణపై నివేదిక ఇవ్వాలన్నారు. చెత్త సంపద కేంద్రాల ద్వారా వచ్చే వర్మీ కంపోస్ట్ ఎరువు విక్రయాల ద్వారా ప్రభుత్వానికి వస్తున్న ఆదాయ వివరాలు తెలపాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తేనే మంచి ఫలితాలు లభిస్తాయని చెప్పారు. మండల ప్రత్యేక అధికారులుగా నియమితులైనవారంతా విధిగా గ్రామ, వార్డు సచివాలయాలను పరిశీలించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించేలా కంట్రోల్ రూమ్లోని అధికారులు నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. విధుల నిర్వహణలో మరింత మెరుగుపడాలని అధికారులు, సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు. నాడు-నేడు కార్యక్రమంలో చేపడుతున్న పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, ప్రభుత్వ వైద్యశాలల పనుల పురోగతిపై నివేదిక పంపాలన్నారు. వైద్య సేవలు ప్రజలకందేలా అధికారుల పర్యవేక్షణ మరింత పెరగాలన్నారు. ఈ సమావేశంలో సి.పి.ఓ. జి. భరత్, డి.పి.ఓ. రమేష్, వివిధ శాఖల కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో సీపీఐ బృందం పర్యటన

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లా కేంద్రంలో జగనన్న కాలనీలలో సీపీఐ బృందం శుక్రవారం పర్యటించింది. కాలనీలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం, అధికారుల నుండి ఎన్నో ఇబ్బందులు ఒత్తుడులు ఎదుర్కొంటున్నామని సిపిఐ బృందానికి గృహ లబ్ధిదారులు వివరించారు. ప్రభుత్వం గృహ నిర్మాణం కోసం ఇస్తున్న రూ.1,80 లక్షలు సరిపోవటం లేదని ఇళ్ళ నిర్మాణానికి రూ. 5 లక్షల మేర ఖర్చు అవుతుందని బృందానికి తెలిపారు. ప్రైవేటు వ్యక్తుల దగ్గర వడ్డీలకు తీసుకువచ్చి ఇబ్బందులకు గురవుతున్నామని అధికారులు ప్రభుత్వం మీరు ఇల్లు కట్టకపోతే మీకు ఇచ్చిన స్థలాలను వెనక్కి తీసుకుంటామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని గృహ నిర్మాణదారులు వాపోతున్నారు. కాలనీల్లో మౌలిక వసతులు విద్యుత్తు కల్పించడంలో అలసత్వం వహిస్తున్నారని వివరించారు. పట్టణాలలో రెండు సెంట్లు గ్రామాలలో మూడు సెంట్లు ప్రతి లబ్ధిదారునికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. సిపిఐ జిల్లా నాయకులు తన్నీరు సింగరకొండ, జేబీ శ్రీధర్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె కరిముల్లా ,బత్తుల శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు

రూ.25 లక్షలతో తరగతి గదుల నిర్మాణం

విశాలాంధ్ర - భట్టిప్రోలు : నాడు నేడు కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శుక్రవారం ఎంపీపీ డి.లలిత కుమారి, జడ్పీటీసీ సభ్యురాలు టి.ఉదయ భాస్కరిలు భూమి పూజ నిర్వహించారు. రూ. 25 లక్షల వ్యయంతో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ అనంతరం ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ నాడు నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి వసతులను కల్పిస్తారన్నారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన విద్యార్థులకు తరగతి గదులను అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చౌటూరి లక్ష్మీ, ఎంపిటిసి వాకా వెంకటనారాయణ, ప్రధానోపాధ్యాయులు కనపర్తి నిరీక్షణరావు, విద్యా కమిటి చైర్మన్ చెన్ను సాంబ శివరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వైద్యురాలు రామలక్ష్మికి సత్కారం

విశాలాంధ్ర - భట్టిప్రోలు : ఉత్తమ వైద్యురాలుగా అవార్డు అందుకున్న మండలంలోని వెల్లటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు చావలి రామలక్ష్మిని శుక్రవారం ప్రజాప్రతినిధులు సత్కరించారు. ఫ్యామిలీ ఫిజిషయన్ ప్రోగ్రాంలో భాగంగా పిహెచ్ పరిధిలోని గ్రామాల్లో 104 వైద్యశిబిరాల నిర్వహణ, రోగులకు సేవలు అందించినందుకు గాను వైద్యురాలు రామలక్ష్మి ఇటీవల కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. స్థానిక వైద్యశాల ఆవరణలో రామలక్ష్మిని శాలువాలు, పూలమాలలతో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలోసర్పంచ్ చౌటూరి లక్ష్మి, ఎంపీపీ డి. లలితకుమారి, జడ్పిటిసి సభ్యురాలు టి.ఉదయ భాస్కరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనపర్తి నిరీక్షణరావు, వైద్యురాలు కృపాసుమతి, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **SRIKANTHA AJAY KUMAR,** Previsouly called, **SRIKANTHA AJAYA KUMAR,** S/o Ahammad Ali, D.No:7-16, Chinna Panja Street, Mangalagiri, Near Old Bus Stand, Guntur District. I have changed my name as **SRIKANTHA AJAY KUMAR.**

పోస్టల్ ఆర్‌డీ బుక్ పోయినది

పల్నాడు జిల్లా, రెంటచింతల మండలం, రెంటాల గ్రామానికి చెందిన **ఇగుటూరి చంద్రశేఖర్ రెడ్డి, S/o.** శ్రీనివాసరెడ్డికు సంబంధించిన రెంటచింతల పోస్టాఫీసు నుంచి జారీ చేయబడిన పోస్టల్ ఆర్‌డీ ఒరిజినల్ బుక్ నెం.**4497879471,** ఐడి. **480116003102**ను జిరాక్స్ నిమిత్తం రెంటచింతల బస్టాండ్ సెంటర్‌కు వెళ్ళగా పోయినది. ఎంతవెతికినసూ దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల **9553891089** నెంబర్‌లో తెలియజేయగలరు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

ఆర్.ఓ.సి.నెం.2780/2022/ఇ1 తేది: 25-11-2022

నిట్ నెం.48/జె.టి.ఓ/2022-23

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ - సాధారణ నిధులు క్రింద మొత్తము 17 పనులకు ఈ దిగువ ఉదహరించిన తేదీల యందు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా షార్ట్ టెండరు పిలువబడినది.

మొత్తము పనులు - 17 నెం.లు పని నెం. 01 నుండి 17 వరకు :	అంచనా వ్యయము రూ.140.09 లక్షలు
1. టెండరు షెడ్యూల్స్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేదీ	: ది.26-11-2022 ఉదయము గం.11.00 ని ల నుండి
2. టెండర్లు షెడ్యూల్స్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది	: ది.29-11-2022 ఉదయము గం.11.00 ని ల వరకు
3. ప్రైస్ బిడ్ తెరుచు తేది	: ది.29-11-2022 మధ్యాహ్నము గం. 2.00 ని.లకు

మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ http://www.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు. మొబైల్ నెం.9849907303

కమీషనరు,
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

దస్తావేజులు పోయినవి

చిలకలూరిపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సేల్ డీడ్ పత్రం నంబర్ **1502/2000** తో ది. **12-06-2000**న నంబర్‌తో రిజిస్టర్ అయిన, నా ఆస్తి తాలుకు ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవి. ఈ నెల 15 తేదీ నేను మా ఇంటి నుండి గొట్టిపాడు గ్రామ సచివాలయానికి వెళుతుండగా **1502/2000** నెంబరు గల సేల్ డీడ్ డాక్యుమెంట్ పోయింది. తదుపరి అన్ని చోట్ల వెతికినా అది కనిపించలేదు. పైన పేర్కొన్న సేల్ డీడ్ **డాక్యుమెంట్ నెం. 1502/2000** అమ్మకం, బహుమతి లేదా జీపీఏ అన్యాక్రాంతమైనది కాదు. సదరు డాక్యుమెంట్ ఆస్తిని ఏదైనా బ్యాంకులకు లేదా ఏదైనా ఇతర ఆర్థిక సంస్థలకు లేదా నా ద్వారా ఎవరికీ తనఖా పెట్టలేదు. నా దస్తావేజులు ఎవరికైనా దొరికితే నా సెల్ నంబర్ **9866013805**కు సమాచారం అందించగలరు.

దండా కాశీ విశ్వనాథ్,
S/o. లక్ష్మీ నారాయణ,
మిట్టపాలెం, చిలకలూరిపేట మండలం

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన UNITY SMALL FINANCE BANK LTD., గుంటూరువారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా. షెడ్యూల్డు తొలుత కూరేటి పెదబసవయ్య గారు రిజిష్టరు విక్రయ దస్తావేజు నెం.237/1976గా భట్టిప్రోలు సబ్.రిజిస్ట్రార్ ఆఫీసు రిజిష్టరు కాబడిన దాఖలా సంక్రమించి సర్వ హక్కులతో అనుభవించుచూ ఎట్టి ఏర్పాట్లు చేయకనే సుమారు 36సం॥ల క్రితం మరణించినారనియు, సదరు పెదబసవయ్య గారి తదనంతరం షెడ్యూలాస్తి ఆయన సంతానమైన కూరేటి సాంబశివరావు మరియు యర్రంశెట్టి లీలావతిగార్లకు సంక్రమించిన దనియు సదరు ఒరిజినల్ దస్తావేజు 237/1976 వర్షములో తడిచి పాడయిపోయినవని తెలియజేయుచూ పై వారలు సదరాస్తిని యర్రంశెట్టి కోటేశ్వరరావుగారి కుమారుడైన శ్రీనివాసరావుకి రిజిష్టరు దఖలు దస్తావేజు నెం.2169/2011 ది.23-11-2011 ద్వారా సర్వ హక్కులతో దఖలు పరిచినారని తెలియజెప్పుచూ యర్రంశెట్టి శ్రీనివాసరావుగారు షెడ్యూలాస్తిని తనఖాపెట్టి ఋణసౌకర్యము పొందుటకు నాక్లయింటును సంప్రదించినారు. కావున సదరాస్తిపై ఎవరికైననూ ఎట్టి అభ్యంతరము లైననూ వున్నయెడల ఈ దినము నుండి 5 రోజుల లోగా ఈ క్రింది అడ్రస్ నందు వ్రాతపూర్వకమైన ఆధారాలతో సంప్రదించగలరు. గడువు లోగా ఎట్టి అభ్యంతరములు రానియెడల సదరాస్తి నిష్పేచి ఆస్తిగా భావించి నాక్లయింటు ఋణ సౌకర్యము కలుగజేయుదురు. గడువు దాటిన పిమ్మటవచ్చు ఎట్టి అభ్యంతరము లైననూ నాక్లయింటును బంధింపజాలవని తెలియజేయడమైనది.

షెడ్యూలు: గుంటూరు డి॥, భట్టిప్రోలు సబ్.డి॥, భట్టిప్రోలు గ్రామం తాలూకు డి.నెం.449/3రు య.0-33సెంట్లు మింజుమలె పొందుకోడ్డుకు పడమర, ఉత్తర శ్రేణిలో ఉండియున్న ఇంటి నెంబరు 13-81రు గల ఇంటికి దక్షిణపు ప్రక్క దఖలు ఆస్తి చ.గ. 152లు ఖాళీ నివేశనాస్థలమునకు హద్దులు. **తూర్పు:**పంచాయితీ వారి వీధి(అనగా పొందురోడ్డు), అ.27-5.1/2లు, **దక్షిణం:** పంచాయితీ వారి వీధి(అనగా పొందురోడ్డు), అ.53-5.1/2లు, **పడమర:** యర్రంశెట్టి రాంబాబు, యర్రంశెట్టి నరసయ్యగార్ల స్వంత గచ్చి,అ.23-9లు, **ఉత్తరం:** జవ్వాది కోటేశ్వరరావుగారి ఇల్లు, అ.53-5.1/2లు.

గోవిందు సుధామాధురి, అడ్వకేట్
ఫ్లాట్‌నెం.201, హనుమాన్ హైట్స్, అమరావతిరోడ్డు, గుంటూరు. సెల్: 9440260307

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: ఎంపీ

విశాలాంధ్ర - నిజాంపట్నం : ప్రజల సమస్యలు తీర్చేందుకే ప్రభుత్వం కృషి చేస్తుందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరి షత్ కార్యాలయంలో అధికారులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతంలో మండలంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని దానికి నిధులు మంజూరు అవడం జరిగిందని త్వరలోనే మంచినీటి సమస్యను పూర్తిగా నిర్మూలిస్తారన్నారు. ముఖ్యమంత్రి జగన్ జలజీవన్ మిషన్ కింద తాగునీటి సమస్యను పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు కూడా ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తీర ప్రాంతంలో ఎక్కువగా ఆక్వా సాగు జరుగుతుందని ఆక్వా రైతులు ప్రతి ఒక్కరూ లైసెన్సు తప్పనిసరిగా తీసుకోవాలని లేకపోతే ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు వర్తించవని తెలిపారు. ప్రతి ఒక్క రైతు ఈ క్రాప్ చేపించుకోవాలని లేకపోతే ధాన్యం కొనుగోలు, సబ్సిడీ, విపత్తుల సమయంలో పంట నష్టపోతే ఇన్సూరెన్స్ వర్తించదన్నారు. పీఎం కిసాన్ ఇంకా ఎవరైనా ఈకేవైసీ చేపించకపోతే ఈ నెలాఖరులో చూపించుకోవచ్చని తెలిపారు. పాఠశాలలో నాడు నేడు పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ముఖ్య ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల - హరినాథ్ బాబు, జడ్పిటిసి నర్రా సుబ్బయ్య, రేపల్లె ఆర్డిఓ పార్థసారథి, ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి ,తహశీల్దార్ ఎమ్. శిరీష, అధికారులు పాల్గొన్నారు.

బంగారు బాపట్ల నిర్మించుకుందాం: రహీంరెడ్డి

విశాలాంధ్ర - బాపట్ల : అవినీతి అక్రమాలు కుల మత వర్గ బేధాలు సృష్టించి రాజకీయాల చేస్తున్న నాయకులకు స్వస్తి పలికి బంగారు బాపట్లను నిర్మించుకునేందుకు అందరం కలిసికట్టుగా ప్రయాణం చేద్దామని కోట రహీంరెడ్డి తెలిపారు. కర్లపాలెం పంచాయితీ దండుబాటు రోడ్డులోని అను ఎవెన్యూలో శుక్రవారం మండలంలోని యువత, పెద్దలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రహీంరెడ్డి మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గంలో రాను రాను ప్రజా సంక్షేమం మరిచి విపక్షగా విభజించి పాలించే నాయకులు మన బాపట్లకు వద్దనే నినాదంతో ముందుకు వెళదాం అన్నారు. ఎస్సై ఉద్యోగం చేసుకుంటూ నా జీవితం నాకుటుంబం వరకు ఉన్నతంగా ఉంటున్న క్రమంలో నా జన్మభూమిలో జరుగుతున్న పరిస్థితులు భాదించాయన్నారు. కుల మతాల భేదం లేకుండా అన్నదమ్మల్లా కలిసి ఉన్నా అందరం మీ మధ్యకాలంలో కులం పేరుతో రచ్చ అవటం కొందరి అవకాశ మనగడ కోసమే అని తెలిపారు. బంగారు బాపట్ల కోసం అతి త్వరలో బాపట్ల నియోజకర్గ వ్యాప్తంగా పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి తిరిగి పరిస్థితులు తెలుసుకునేందుకు ముందుకు రానున్నాని ఆశీర్వదించాలని కోరారు. మండలంలోని ప్రతి పంచాయితీ నుంచి ఇంత మంది యువత పెద్దలు వచ్చి నాతో ప్రయాణించేందుకు ముందుకు రావటం నాలో ఉత్సాహాన్ని నింపిందన్నారు. సమాజంలో తరతమ్యం లేకుండా నవ సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు నాతో చేతులు కలిపి నడవాలని కోరుతున్నామన్నారు. నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్నా నేను ప్రత్యేక్షంగా వచ్చి సమస్య పరిష్కారం కోసం పోరాటం చేయనున్నట్లు తెలిపారు.

శిధిలావస్థలో ఉన్న ఆరోగ్య శాఖ భవనం తొలగింపు

విశాలాంధ్ర-శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలోని ఎంపిపి పాఠశాలలోని శిథిలావస్థకు చేరిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం పంచాయతీ అధికారులు తొలగించారు. బుధవారం మతుకుమల్లి పర్యటనకు వచ్చిన పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు గ్రామస్తులు విద్యార్థులు పడుతున్న అవస్థలపై ఫిర్యాదు చేసి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రాన్ని పరిశీలించిన కలెక్టర్ వెంటనే స్పందించి శిథిలావస్థకు చేరిన ఆరోగ్య కేంద్రాన్ని తొలగించాలని పంచాయతీ రాజ్, సర్వ శిక్షా అభియాన్ ఇంజనీర్లను ఆదేశించారు. ప్రొక్లయిన్‌తో పాడుబడిన భవనాన్ని తొలిగించి వచ్చిన రాళ్లు, మట్టిని పాఠశాల వెనుక రోడ్డుకు తరలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో ఏ అధికారి ఈ సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయలేదని, ఇప్పటి జిల్లా కలెక్టర్ రెండు రోజులలోనే స్కూల్ పిల్లలు పడుతున్న సమస్యను పరిష్కరించడం చాలా గొప్ప నిర్ణయం అని కొనియాడారు. సర్పంచ్ యలగాల బసవయ్య, పీఎంసీ చైర్మన్ పాపారావు, హెచ్‌ఎం కాశీ విశాల, ఉపాధ్యాయులు కలెక్టర్ కు ధన్యవాదాలు తెలిపారు.

ప్రత్యేక హోదా వెతికి పట్టుకోవాలని ఫిర్యాదు

విశాలాంధ్ర-తాడేపల్లి: మా ప్రత్యేక హెూదా పోయింది సీఎం జగన్మోహన్ రెడ్డి దొంగలించాడని అనుమానంగా ఉంది, ఎంపీ విజయ సాయి రెడ్డి ఫోన్‌తో పాటు మా ప్రత్యేక హెూదాను కూడా వెతికి పట్టుకోవాలని మంగళగిరి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పడవల మహేష్ ఆధ్వర్యంలో జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ, మంగళగిరి తెలుగుయువత అధ్యక్షులు పడవల మహేష్, రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, జిల్లా ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్‌లు మండల అధ్యక్షులతో కలిసి శుక్రవారం సాయంత్రం తాడేపల్లి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు 25 ఎంపీ స్థానాలు గెలిపిస్తే కేంద్రం మెడలో వంచి ప్రత్యేక హెూదాన్ని తీసుకు వస్తానని నిరుద్యోగులకు, రాష్ట్ర అభివృద్ధికి పాటుపడతానని చెప్పిన జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల పూర్తయి మూడున్నర సంవత్సరాలు అయింది. మాకు జగన్మోహన్ రెడ్డి మీద నమ్మకం ఉంది. ఈపాటికి కేంద్రం మెడలు వంచి రాజధాని తీసుకువచ్చి ఉంటాడు. కానీ అది ఎవరికీ కనబడకుండా తన వద్ద దాచుకొని ఉంటాడు అని అనుమానం కలుగుతుందన్నారు. సీఎం సాధించి దాచుకున్నటువంటి ప్రత్యేక వాదాన్నికూడా వెతికి పట్టుకొని ఆంధ్రప్రదేశ్ యువతకు ప్రజానీకానికి ఉపయోగపడే విధంగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందుల నాగార్జున, షేక్ బాజి, దర్శి హరికృష్ణ, మన్నం అశోక్, షేక్ ఖాసీం బాబు, సిగిరిశెట్టి లీలా కృష్ణ, కొప్పుల మధుబాబు, గుద్దంటి నాగేశ్వరరావు, రెంటపల్లి రాజేష్, మంగళగిరి ఈపూరి జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వీయరక్షణ నేర్చుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినం సందర్భంగా బ్రెయిట్ హోరిజన్స్ ఫౌండేషన్, యువనారీస్ హెల్త్‌కేర్ ఆర్గనైజేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సంగడిగుంటలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల (మైనార్టీ బాలికలు)లో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఫౌండర్ ఆఫ్ వైఎన్‌హెచ్‌సీ, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తాన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మహిళలు తమపై జరిగే అఘాయిత్యాలను ఖచ్చితంగా ఇతరులకు తెలియపరచాలని, స్వీయరక్షణ నేర్చుకోవాలని, బాల్యం నుంచే భావ ప్రకటన కలిగి ఉండాలని కోరారు. ఈ పాఠశాలలో నవంబర్ 26వ నుంచి డిశంబర్ 10వ తేదీ వరకు యువనారీస్ హెల్త్‌కేర్ ఫిర్యాదు బాక్సును అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రెయిట్ హోరిజన్స్ చైర్మన్ మొహియుద్దీన్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ షేక్ నజీర, పాఠశాల ఇన్‌ఛార్జ్ మధుసూధనరావు, ముస్లిం ఐక్యవేదిక సభ్యులు అబ్దుల్ కలాం, బాజీ తదితరులు పాల్గొన్నారు.

బీమా సుగం పోర్టల్ విరమించుకోవాలి

విశాలాంధ్ర-వినుకొండ: ఇన్సూరెన్స్ రంగంలో ఐఆర్డీఏఐ ప్రవేశ పెట్టిన బీమా సుగం పోర్టల్‌ను విరమించుకోవాలని ఎల్ఐసి ఏజంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. వినుకొండ బ్రాంచి కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నాయకుల సమావేశం శుక్రవారం బ్రాంచి ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రసంగిస్తూ బీమా సుగం వల్ల యల్ఐసిలో ఏజెంట్ల వ్యవస్థ దెబ్బ తింటుందని అన్నారు. పాలసీలపై జిఎస్‌టిని తీసివేయలని, బోనస్ పెంచాలని, డైరెక్ట్ మార్కెటింగ్‌ను నిలిపివేయాలని, ఈ ఇన్సూరెన్స్ విధానాన్ని విరమించుకోవాలని కోరుతూ డిశంబరు 9వ తేదీన హైదరాబాద్ లోని ఐఆర్‌డిఎఐ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం జరుగుతుందన్నారు. ధర్నాలో అధిక సంఖ్యలో ఏజంట్లు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆర్‌జే నరసింహారావు, యస్ కోటేశ్వరరావు, వి శ్రీనివాసరావు, జి నవీన్ కుమార్, జి సీతారామయ్య, ఐరామూర్తి, యస్ చంద్రశేఖర్, పి మస్తాన్ రెడ్డి, పి బ్రహ్మయ్య, బి అంజిరెడ్డిలు పాల్గొన్నారు.

పంచ సూత్రాలతో విజయం తథ్యం

విశాలాంధ్ర-గుంటూరు : డైవర్సిటీ, మోడ్యులారిటీ, ఓపెన్‌నెస్, స్లాగ్ రిసోర్సెస్, మ్యాచింగ్ సైకిల్... ఈ ఐదు సూత్రాలను విద్యార్థులు పాటించినట్లయితే విజయం తథ్యమని లక్నోలోని ఐఐఎం ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ ఎస్.వెంకటరమనయ్య అన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శుక్రవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ మేనేజ్‌మెంట్ పర్‌స్పెక్టివ్స్ స్ట్రాటజీస్ ఫర్ సస్టేనబుల్ బిజినెస్ గ్రోత్ అండ్ ఇన్నోవేషన్' అనే అంశంపై రెండు రోజులపాటు జరిగే అంతర్జాతీయస్థాయి సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. అనంతరం సదస్సుకు సంబంధించిన కాన్ఫరెన్స్ ప్రొసీడింగ్స్‌ను ప్రముఖులు ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ ఎస్.వెంకటరమనయ్య మాట్లాడుతూ భవిష్యత్తు లక్ష్యాలు సాధించాలంటే మన సంపాదనలో కొంత భాగాన్ని క్రమశిక్షణతో పొదుపు చేసుకోవాలని సూచించారు. మార్కెట్లో కొన్ని వేల కంపెనీలు ఉంటాయని, వాటి పనితీరును అంచనా వేస్తూ పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందన్నారు. ఇది కొంత కష్టంతో కూడుకున్న పని అన్నారు. ఇలాంటి పెట్టుబడులపై విద్యార్థులు చదువుకునే వయసు నుంచే పూర్తి అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ఆన్‌లైన్లో హాజరైన యూఎస్‌ఏలోని గ్రేస్‌ల్యాండ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ దేస్తి కన్నయ్య మాట్లాడుతూ ఏ వ్యాపారానికైనా సరే రాబడి విషయంలో నిజంగా ఉన్న సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించుకోవడం కూడా ఓ కళేనన్నారు. వ్యాపారాల్లో ప్రాథమిక పరిశోధనా పద్ధతులు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాబడికి నూతన మార్గాలు అన్వేషించడం, ఉత్పత్తి అయిన వస్తువులకు డిమాండ్ పెంచుకోవడం, నష్టాలొస్తుంటే అందుకు గల కారణాలు లాంటి అంశాలపై పరిశోధనాత్మకంగా ఆలోచించే ధోరణి అలవాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మలేసియాలోని టేలర్స్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.బాలసుబ్రమణియన్ పాల్గొన్నారు.

రక్తహీనత, పోషణ లోపం నివారణకు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - బాపట్ల : గర్భిణులు, కిశోర బాలికలలో రక్తహీనత, పోషణ లోపం నివారణకు వైద్య అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్లో ఆమె సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని తెలిపారు. నిద్రావస్థలో ఉన్న వైద్యాధికారులను మేల్కొల్పండి విధులకు గైర్హాజైనవారు, దీర్ఘకాల సెలవుపై వెళ్లిన వైద్యాధికారులపై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. మాతృ, శిశు మరణాలు గత నెలలో నమోదు కావడంపై ఆమె అసహనం వ్యక్తంచేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే ధృక్పథంతో వైద్యరంగానికి అత్యధిక నిధులు కేటాయిస్తుందన్నారు. మెరుగైన వసతుల కల్పనకోసం నాడు-నేడు కింద వైద్యశాలలు నిర్మిస్తూ మరమ్మతులు చేస్తుందన్నారు. జిల్లాలో 17 లక్షల జనాభా ఉండగా ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో 50 వేల మంది బి.పి.తో, మరో 40 వేలమంది చక్కెర వ్యాధితో బాధపడుతున్న విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. జిల్లా గ్రామీణ ప్రాంతాలలోని 43 పి.హెచ్.సి.లలో ఆరోగ్యశ్రీ అమలవుతుండగా పట్టణ ప్రాంతాలలో 12 వైద్య శాలల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందడంపై ఆరా తీశారు. 108 అంబులెన్స్ వాహనాలు 25 నడుస్తున్నాయన్నారు. 3,665 మంది కిశోర బాలికలలో రక్తహీనత, పోషణ లోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. డిసెంబరు ముగిసేవరకు మలేరియా వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నపిల్లల్లో నిమోనియా రాకుండా జాగ్రత్తలు తీసుకునే అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులకు ఉద్యోగాలు పోతాయని ఆమె హెచ్చరించారు. గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలన్నారు. డి.ఆర్.ఓ. కె. లక్ష్మీ శివజ్యోతి, డి.ఎమ్.హెచ్.ఓ. ఎస్. విజయమ్మ, డి.సి.హెచ్.ఎస్. కె. విజయలక్ష్మి, గృహనిర్మాణ శాఖ పి.డి. ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

డిసెంబర్ 10 వరకు సమాజ చైతన్య కార్యక్రమాలు : జేసీ

విశాలాంధ్ర-నరసరావుపేట కలెక్టరేట్: విశ్వ వ్యాప్తంగా మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను పారద్రోలేదుకు నవంబరు 25 నుంచి డిసెంబరు 10 వరకు సమాజ చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మహిళలపై జరుగుతున్న హింస నిర్మూలన దినోత్సవ కార్యక్రమాలను 15 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కలెక్టరేట్ నుంచి వైఎస్ఆర్ ప్రభుత్వ వైద్యశాల వరకు ఐసీడీఎస్ శాఖ, అంగన్ వాడీ, మహిళా పోలీస్ శాఖల మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం డిసెంబరు వరకు అన్ని ప్రాంతాల్లో పలు మహిళా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని భారత మహిళా శిశు సంక్షేమ శాఖకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసినట్లు తెలిపారు. పలు రూపాల్లో మహిళలపై జరిగే హింస, వివక్షను పారద్రోలడంతో పాటు కనీస మానవ హక్కులు మహిళలకు వర్తించే విధంగా మన సమాజం మార్పు చెందాలనే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు, బాలికలకు ఉన్న సంక్షేమ పథకాలు, న్యాయ బద్ధంగా ఉన్న చట్టాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. మహిళా పునరావాస కేంద్రాలు ఉజ్వల, స్వధార్ హెల్ప్ లైన్ నంబర్లపై ప్రతీ మండలంలో ఏర్పాటు చేసి అవగాహన కల్పించి మెరుగైన సమాజం కోసం కృషి చేయాలని కోరారు. మహిళా శిశు సంక్షేమ పథకాల అమలు, జరుగుతున్న హింసను పారద్రోలడానికి కృషి చేయాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఇన్ ఛార్జ్ ప్రాజెక్ట్ అధికారి అరుణ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, సీడీపీవోలు ఎం.అనురాధ, ఉమామహేశ్వరి, శాంత కుమారి, అంగాన్ వాడీ టీచర్లు, మహిళా పోలీస్ శాఖల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆ మూడు రంగాల్లో ఎంవీ రామిరెడ్డి విశేష కృషి..

'అనిర్వచనం' పుస్కకావిష్కరణ సభలో డాక్టర్ పాపినేని శివశంకర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఎంవీ రామిరెడ్డి కథ, కవిత్వం, విమర్శ ఈ మూడు రంగాలలో విశిష్టమైన కృషి చేస్తున్నారని, అన్నింటికన్నా రచయితలకు ముఖ్యంగా కావాల్సిన నిజాయితీ రామిరెడ్డి రచనలలో కనిపిస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. స్థానిక ఏఎల్ బీఈడీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గుంటూరు 22వ పుస్తక మహోత్సవాలలో భాగంగా అరసం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అభ్యుదయ సాహితీవేత్త ముత్యాల ప్రసాద్ సాహితీ వేదికపై ఎంవీ రామిరెడ్డి కవితా సంపుటి 'అనిర్వచనం' ఆవిష్కరణ సభ జరిగింది. ఈ పుస్తకాన్ని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆవిష్కరించారు. ఈ కవితా సంపుటిని కేంద్ర, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్‌కు అంకితం చేశారు. తొలి ప్రతిని అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణకు అందజేశారు. అనంతరం డాక్టర్ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ సరికొత్త వస్తువుతో..సరికొత్త అభివ్యక్తితో కవిత్వం రాస్తున్న రామిరెడ్డి నాకు శిష్యుడైనందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన రామిరెడ్డి రైతుల వెతలను తన రచనల్లో సహజంగా వ్యక్తీకరిస్తున్నారని అన్నారు. ప్రముఖ సాహితీవేత్త రావెల సాంబశివరావు మాట్లాడుతూ డిజిటలీకరణ పేరుతో ఆధునిక యుగం మరింత సంక్షోభమయంగా మారుతుందని, అనిర్వచనీయం కవితా సంపుటి అదే విషయాన్ని నొక్కి వక్కాణిస్తుందన్నారు. రైతు సమస్యలు, మానవీయ సంబంధాల మధ్య ఏర్పడుతున్న అగాధాలు, 5జీ పేరుతో డిజిటల్ యుగం సృష్టిస్తున్న విధ్వంసం తదితర సమస్యలను తమ కవితల ద్వారా రామిరెడ్డి ఆవిష్కరించారని వివరించారు. అంతిమంగా మానవీయ వికాసమే సమాజ ప్రగతికి దోహదం చేయగలదని అన్నారు. అనంతరం అనిర్వచనం పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా రామిరెడ్డితో తనకు పరిచయం ఉందన్నారు. ప్రపంచీకరణ కేవలం ఆర్థిక వ్యవస్థకే పరిమితం కాకుండా కేవలం అది సంపద సృష్టిస్తుంద న్నారు. అది సంపదకే కాకుండా సాహిత్యం, మానవ సంబంధాలు, కళలుపై కూడా ప్రభావితం చేస్తుందని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన యువ సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ మాట్లాడుతూ రామిరెడ్డి ప్రస్తుత సమాజ ట్రెండ్‌ను అర్థం చేసుకుని అనిర్వచనం అనే కవితా సంపుటి రాయటం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో అనేక మంది కవులు, రచయితలు పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణలో రక్త, స్కానింగ్ పరీక్షలు కీలకం

విశాలాంధ్ర-తెనాలి : వ్యాధి నిర్ధారణలో రక్త పరీక్షలు, ఎక్స్ రే, స్కానింగ్ పరీక్షలు ఆధునిక వైద్య విధానంలో కీలక పాత్రలు పోషిస్తున్నాయన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక రత్న ఫార్చ్యూన్ కళ్యాణ మంటపంలో స్కానింగ్ ప్లానింగ్ అంశంపై అడగండి చెపుతాం చర్చా వేదిక అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమ నిర్వాహకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా కార్యక్రమానికి అనుసంధాన కర్తగా వ్యవహరించారు. ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ మహమ్మద్ రియాజ్‌ఖాన్ చర్చలో పాల్గొంటూ అల్ట్రా సౌండ్, ఏమ్మారై స్కానింగ్‌లో రేడియేషన్ ఉండదని తెలిపారు. కొన్ని పరీక్షల్లో రేడియేషన్ ఉంటుందని, మరికొన్ని పరీక్షల్లో రేడియేషన్ ఉండదని ఆయన స్పష్టం చేశారు. గర్భంలో ఎదుగుదల సక్రమంగా లేకపోతే నీటి తొట్టెలో ఉంచి అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేస్తే బిడ్డ ఎదుగుదల ఉంటుందని, అంతర్జాతీయ జర్నల్స్ నివేదికి ఇచ్చాయని ఆయన పేర్కొన్నారు. దీనివలన పిండానికి ఎలాంటి కీడు జరగదని రియాజ్‌ఖాన్ తెలిపారు. అయితే గర్భిణీ స్త్రీలకు ఎక్స్ రే, ఏమ్మారై పరీక్షలు చేయరాదని తెలిపారు. డాక్టర్లలో కొందరు అనవసరంగా స్కానింగ్‌లు రాస్తున్నారని ప్రశ్నించగా డాక్టర్లలో అధికశాతం రోగిని ఎలాగైనా బతికించాలనే ప్రయత్నిస్తారు కానీ వ్యాపార దృక్పధంతో అందరు డాక్టర్లు ఉండరని అభిప్రాయం వ్యక్తం చేశారు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాల పేతాలజిస్ట్ డాక్టర్ భరత్ చర్చాలో మాట్లాడుతూ మహిళల్లో వస్తున్న గర్భసంచి ముఖ ద్వారా కేన్సర్, వృక్షోజాల కేన్సర్‌లకు ఇస్తున్న కీయోథెరఫీ వలన కొంత ఇబ్బంది ఉన్నప్పటికీ దానికన్నా మెలే అధికం అన్నారు. కేన్సర్‌ను ముందుగా గుర్తించే పరీక్షలు ఇపుడు వచ్చాయని, దాని ద్వారా వ్యాధి నివారణ జరుగుతుందని ఆయన తెలిపారు. ఎమ్మారై స్కానింగ్ నిపుణులు షేక్ ఖాదర్ బాషా మాట్లాడుతూ సొరంగం లాంటి యంత్రంలోకి మనిషికి పంపించి ఏమ్మారై స్కానింగ్ చేస్తుంటే కొందరు భయపడుతున్నారని ఇపుడు అవసరం లేకుండా చెవులకు సంగీతం వినిపించేలా, కంటికి కనిపించకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్స్‌రేకు మరో ఎక్స్‌రేకు కనీసం వారం రోజుల వ్యవధి ఉండటం మంచిదన్నారు. ఎక్స్‌రే కిరణాలు బాలింతలు గర్భిణీపైకి ప్రసరించకుండా చేయవచ్చని తెలిపారు. ఇటీవల కరోనా కాలంలో తమ ప్రాణాలను లెక్క చేయకుండా ఎన్నో ప్రాణాలు నిలబెట్టిన డాక్టర్లకు దిలీప్‌రాజా కృతజ్ఞతలు తెలిపారు. కరోనా రోగులకు చికిత్స చేస్తూ మృతి చెందిన తెనాలికి చెందిన డాక్టర్ లవకుశులు, ప్రవీణ్‌లకు అడగండి చెపుతాం చర్చా వేదిక నివాళులర్పించింది. ఈ కార్యక్రమంలో కొక్కిలిగడ్డ కిరణ్, ప్రభాకర్, మున్నంగి భాను, ప్రసాద్, లైరర్ జి.ఎఫ్.కిరణ్‌కుమార్‌లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో యాక్స్ ట్రైలర్ మొహిద్దీన్, బాషా, మిలటరీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ మున్సిపాలిటీ కార్యాలయము నందు మున్సిపల్ ఇంజనీరింగ్ రంగంలో పనిచేస్తున్న కరెంటు , వాటర్ స్కీ, వాచ్మెన్, అటెండర్ లాంటి ఇంజనీరింగ్ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస పనికి కనీస వేతనం ఇవ్వాలని మున్సిపల్ ఆఫీసు ముందు గేటు మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌ను ఉద్దేశించి ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి నేను అధికారంలోకి రాగానే మున్సిపల్ వర్కర్స్‌కి సమాన పనికి సమాన వేతనం ఏర్పాటు చేస్తారని చెప్పి మాట తప్పారన్నారు. ఏఐటీయూసీ పోరాట ఫలితంగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రూ.21వేల వేతనం సాధించామన్నారు. మున్సిపాలిటీలలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మిక సంఘాలకు అనుబంధ కార్మిక సంఘాలకు కూ.15వేలు మాత్రమే ఇస్తున్నారనీ అవి ఏమాత్రం సరిపోవని, సుప్రీంకోర్టు గైడెన్స్ ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని బూదాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికై డిసెంబర్ నెలలో 6,7, 8 తేదీలలో ఒంగోలు నగరంలో మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని ఆ మహాసభలలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కొండముట్ల సుభాని, ఆర్ వందనం, మల్లికార్జునరావు, మున్సిపల్ కార్మికులు నాగరాజు, నాగూరు శ్రీను, స్వామి, మస్తాన్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్‌కు పూర్వ వైభవాన్ని చేకూర్చాలి

విశాలాంధ్ర-గుంటూరు : గ్రామీణ ప్రాంతాలలోనే కాకుండా పట్టణ ప్రాంతాలలో సెల్‌ఫోన్ నెట్‌వర్క్ తరచు తీవ్ర అంతరాయాలు ఏర్పడుతూ ఉండటం వాల్ల వినియోగాదారులుకు తీవ్ర అగచాట్లుకు గురవుతూ ఉన్నారంటూ గుంటూరు బీఎస్ఎన్ఎల్ భవన్‌లో శుక్రవారం జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా సలహా కమిటి తొలి సమావేశంలో సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. కమ్యూనికేషన్ వ్యవస్థలో ప్రైవేటు సంస్థలకు దీటుగా బీఎస్ఎన్ఎల్‌ను తీర్చిదిద్ది తిరిగి పూర్వ వైభవాన్ని చేకూర్చాలని సభ్యులు కోరారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో ముఖ్యంగా శివారు గ్రామాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థ సక్రమంగా లేదని, సరికొత్త టెక్నాలజీతో 4జీ సౌకర్యం కల్పించాలన్నారు. నేడు అన్ని విద్యా సంస్థలలో తరగతులు, రేషన్, విద్యార్థుల హాజరుతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు రేషన్ ఇతర పలు పథకాలన్నీ ప్రస్తుతం ఆన్‌లైన్‌పై ఆధారపడి ఉందన్నారు. ఆర్థిక సమస్యలు ఉంటే పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని అన్నారు. ఎంపీలు గల్లా జయదేవ్, ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, సభ్యులు షేక్ అబ్దుల్ రహీం, టి.రాజగోపాల్, హరీష్ ఆన్‌లైన్‌లో పాల్గొనగా ఈ కార్యక్రమంలో టెలికాం జిల్లా సలహా కమిటీ సభ్యులు నిమ్మరాజు చలపతిరావు, గుంటూరు టెలికాం జిల్లా జీఎం వై.రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి సచివాలయ ఉద్యోగుల సమస్యలు

విశాలాంధ్ర-గుంటూరు : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం సీఎం జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళారు. పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-5లకి వన్ సెక్రటరీ వన్ పంచాయతీ ఫైల్ మీద సంతకం చేసి తద్వారా పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-5లకి డీడీఓ పవర్స్, సర్వేయర్స్‌ని గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2 మార్పుకి ఆమోదించిన సీఎంకు అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కాకర్ల వెంకటరామిరెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ బీఆర్‌ఆర్ కిషోర్, జాయింట్ సెక్రటరీ భవనం వెంకటరామిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా ట్రాన్స్‌ఫర్స్ విషయం, ఎనర్జీ సెక్రటరీ(జేఎల్ఎం గ్రేడ్-2)ల సమస్యలు సీఎంకు వివరించారు. పెండింగ్ డీఏలను వెంటనే ఇవ్వాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై పనిఒత్తిడి ఉందని, జాబ్ చార్ట్ అమలు సరిగ్గా జరగడం లేదనే విషయాలను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు.

నాటు సారా, గుట్కాలపై ఉక్కుపాదం మోపాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : నాటు సారా, గుట్కాలపై ఉక్కు పాదం మోపాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని నగరం, నిజాంపట్నం పోలీస్ స్టేషన్లను ఎస్పీ సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ సిబ్బందితో, గ్రామ సచివాలయ మహిళ పోలీసులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. గ్రామ స్థాయిలో జరుగుతున్న నేరాలు గురించి సమీక్షించారు. జిల్లాలో నాటు సారాపై ఉక్కుపాదం మోపి కట్టడి చేయాలని ఆయన తెలియజేశారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా అసంఘిక కార్యకర్తలు జరిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రౌడీ షీటరు, పాత నేరస్థుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. రేపల్లె సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ టీ మురళీకృష్ణ, బాపట్ల స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఏ శ్రీనివాస్, రేపల్లె రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకర్, నగరం పోలీస్ స్టేషన్ ఎస్ఐ రామకృష్ణ, నిజాంపట్నం పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం రోశయ్య, ఎస్ పి సి సి హరికృష్ణ, తదితర పోలీస్ అధికారులు అయన వెంట ఉన్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులకు శంఖుస్థాపన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పాఠశాలలకు మహర్దశగా ఉందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపి అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్యేలు మహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్, మేయర్ కావటి మనోహర్‌నాయుడులు అన్నారు. శుక్రవారం తూర్పు నియోజకవర్గంలోని 14వ డివిజన్‌లో కావటి శంకరరావు నగరపాలక సంస్థ పాఠశాల్లో రూ.1.53కోట్లతో అదనపు తరగతి గదులు, రూ.కోటి వ్యయంతో ఆధునీకీకరణ పనులకు వారు శంఖు స్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో విద్యా, వైద్య రంగాలు చాలా అభివృద్ధి చెందాయని, నాడు-నేడు పథకాలతో పాఠశాలలు, ఆసుపత్రులు రూపురేఖలు మారుతున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వేముల జ్యోతి పద్మజ, షేక్.ఫర్జానా, నిమ్మల వెంకటరమణ, వైసీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, వేముల శ్రీనివాసరావు, డీఈ రమేష్, ఏఈ రాంబాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే మీ గడపకు..

విశాలాంధ్ర - కర్లపాలెం : సమస్యల పరిష్కారానికే ప్రతి గడపకు వస్తున్నాం అని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. మండలంలోని కొత్తనందాయపాలెం గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన గ్రామంలో పర్యటించి ప్రతి ఇంటికి బ్రౌచర్‌ను అందజేశారు. అనంతరం కోన మాట్లాడుతూ ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తున్నామన్నారు. పాలనను ప్రజా ముగింటికే తీసుకవచ్చి అర్హులందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆట్ల వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, మల్లెల ఆదాం, మందపాటి పరమానందకుమార్, యారం ఇస్సాకు, మార్పు బెనర్జీ, చిక్కాల సాగర్ తదితరులున్నారు.

రాజ్యాంగం ద్వారానే ప్రజాస్వామ్యానికి రక్ష

విశాలాంధ్ర-గుంటూరు : భారత రాజ్యాంగం ద్వారానే భారతదేశం ప్రపంచ దేశాలలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా వర్ధిల్లుతున్నదని, రాజ్యాంగం ద్వారానే ప్రజాస్వామ్యానికి రక్షణ అని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ నెల 26వ తేదీ రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా శుక్రవారం అప్పాపురం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవంను ప్రధానోపాధ్యాయులు గేరా మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షులు, హెచ్‌ఎం గేరా మోహనరావు మాట్లాడుతూ విద్యార్థులలో ప్రాథమిక స్థాయి నుంచి దేశభక్తి, ప్రజాస్వామ్యం, సామాజిక స్పృహ, లౌకిక భావాలు, సమసమాజ నిర్మాణం, శాస్త్రీయ ఆలోచన, గణతంత్ర రాజ్యం, సామాజిక న్యాయం, సామాజిక సంస్కరణలు, నైతిక విలువలు తదితర అంశాలపై పూర్తి అవగాహన కలుగచేయాలని, అందుకే అంబేద్కర్ విగ్రహం వద్దకు విద్యార్థులను తీసుకువచ్చి రాజ్యాంగ దినోత్సవం గురించి వివరించడం జరిగిందని తెలిపారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆడవాళ్ళకు త్వరితగతిన న్యాయం చేసేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని గుంటూరు జిల్లా కోర్టు సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఎ.రత్న అన్నారు. అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అహల్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో 'మహిళల భద్రత-మన బాధ్యత'అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎ.రత్న మాట్లాడుతూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు అనేవి ప్రత్యేకమైన కోర్టులు అని, వీటిని ఒక ప్రత్యేకమైన సమస్యకు ఒకటి చొప్పున రాష్ట్ర ప్రభుత్వాలు హైకోర్టు అనుమతితో ఏర్పాటు చేస్తారని వివరించారు. వేగవంతమైన విచారణ, నికరంగా కేసులను తగ్గించడం వీటి లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జోత్స్న, మాజీమంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ, ప్రముఖ స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ శనక్కాయల రాజకుమారి, ప్రముఖ న్యాయవాది ఎం.వెంకటకృష్ణ, ప్రముఖ గైనకాలజిస్ట్, జీటీజీఎస్ సెక్రటరీ డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ రమ్యా స్వాతి, మహిళా సాధికారిత సెల్ కన్వీనర్ పి.విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలనకు చిరునామా జగన్

విశాలాంధ్ర-ఫిరంగిపురం: రాష్ట్రంలో అవినీతి పాలనకు చిరునామాగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నిలిచారని తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేములూరిపాడు గ్రామంలో రెండోదప కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాల గురించి ఎమ్మెల్యే ప్రజలకు తెలియజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సియం జగనన్న ప్రజలకు ఇచ్చిన మాట మేరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సుపరిపాలన సాగిస్తూ అవినీతికి అవకాశం లేకుండా చేశారని కొనియాడారు. సియం ఆశయాన్ని వమ్ము చేయకుండా ప్రతి వాలంటీర్ నిష్పక్షపాతంగా పని చేసి ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు మార్పుల శివరామిరెడ్డి, గుమ్మడి చంద్రం, గఫార్, జేమ్స్, అంజిరెడ్డి, సర్పంచ్‌లు కొరివి చిన్నా, ఆనంద్, మెల్కియా, పూసపాటి వెంకటరామిరెడ్డి, ఎంపిటీసిలు అమర్లపూడి అనురాధ, రత్నం, గాంధిబుడె, సకిలా లక్ష్మీ, పిచ్చిరెడ్డి, కృష్ణ, గొట్టిపాటి వెంకటేష్, స్వర్ణ చిన్నప్ప, మీరా, పిల్లి విజయరాజు, పిట్ల వెంకటరావు, నరేంద్రకుమాం, మాబుల్లా, వివిధ శాఖలకు చెందిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.